

వేడుకల్లో మిగిలిపోయిన ఆహారంతో పేదల ఆకలి తీర్చవచ్చు అన్న 'ఆంధ్రజ్యోతి' కథనం జగ్గయ్యపేటకు చెందిన ఆర్యవైశ్య యువజన సంఘం ఉపాధ్యక్షుడు మహంకాళి జయప్రకాశ్‌ను ఆలోచనలో పడేసింది. అది కొన్నాళ్లకు అన్నపూర్ణ సేవా సమితిగా ఆవిర్భవించింది. ఎక్కడ ఆహారం మిగిలిపోయినట్లు తెలిసినా వెంటనే తీసుకొచ్చి పేదలకు పంచిపెట్టే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. తొలినాళ్లలో సంవత్సరానికి 50 నుంచి 60 రోజులు ఆహారం పంపిణీ చేసిన సంస్థ నేడు 365 రోజుల్లో 300 రోజుల పాటు పేదల ఆకలి తీరుస్తోంది. పదేళ్ల కాలంలో 200 మంది వాలంటీర్లతో జగ్గయ్యపేట, సమీప గ్రామీణ ప్రాంతాలు, మండల కేంద్రాల్లోనూ, తెలంగాణ ప్రాంతంలోని కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంతాలకు సేవలను విస్తరించింది. ఏటా లక్ష మందికిపైగా ఆహారం అందిస్తూ అన్నార్తుల పాలిట అన్నపూర్ణగా వర్థిల్లుతున్న అన్నపూర్ణ సేవా సమితిపై ప్రత్యేక కథనం.

అన్నార్తుల పాలిట.. అన్నపూర్ణ

వేడుకల్లో ఆహార వృథాకు అడ్డుకట్ట

- మిగిలిన ఆహారం సేకరణ
- పేదలవాడల్లో పంపిణీ



ఆహారం కోసం క్యూలో నిలబడిన పేదలు (ఇన్‌సెట్)లో అన్నం వడ్డిస్తున్న అన్నపూర్ణ సేవాసమితి సభ్యులు,

8లో

ఇక అభివృద్ధి పరుగులు

- జిల్లాలో 1,185 పనులకు రూ.17.11 కోట్లు మంజూరు
- మురుగునీటి చెరువుల్లో డ్రోన్లతో పిచికారి
- కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి
- ఈవోఆర్‌డీల సమావేశంలో డీపీవో డాక్టర్ జె.అరుణ



ఈవోఆర్డీవోల సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో అరుణ

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అభివృద్ధి పరుగులు పెట్టనుందని జిల్లా పంచాయతీ అధికారి డాక్టర్ జె.అరుణ తెలిపారు. 1,185 అభివృద్ధి పనులకు రూ.17.11 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఈ పనులను మండలాల్లో ఈవోఆర్‌డీలు వేగవంతం చేయాలని ఆదేశించారు. గురువారం ఈవోఆర్‌డీలు, మండల స్థాయి కో ఆర్డినేటర్లతో డీపీవో కార్యాలయ సమావేశపు హాలులో సమీక్షా సమావేశం నిర్వహించారు. డీపీవో అరుణ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో నిర్వహిస్తున్న 497 అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు పీఆర్‌ఐ మొబైల్ యాప్‌లో పొందుపరచాలన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కార్మికులు వెళ్లలేని నిల్వ ఉన్న మురుగు నీటి చెరువుల్లో దోమలు పెరగకుండా డ్రోన్లతో పిచికారీ చేసే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. సీఎం చంద్రబాబు సూచనల మేరకు జిల్లాలోని మేజర్ పంచాయతీల్లో ఏయే పనులకు డ్రోన్లు వినియోగించాలో తెలియజేయాలన్నారు. జిల్లాలోని 480 పంచాయతీల్లో సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్లు ఉన్నాయని, ఆ కేంద్రాల్లో తడిచెత్తతో వర్మీ కంపోస్టు ఎరువులు తయారు చేయిస్తూ పంచాయతీకి ఆదాయపు వనరులు సమకూర్చాలన్నారు. పంచాయతీల్లో పనిచేసే కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మెడికల్ క్యాంపులు నిర్వహించామన్నారు. అలాగే రూ.15 లక్షల యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తున్నామని వివరించారు. జిల్లా కలెక్టర్ బాలాజీ చొరవతో ప్రీమియం పంచాయతీలే చెల్లించే విధంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా రెవెన్యూ అధికారిగా రోహిణి

మచిలీపట్నం, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో)గా పి.రోహిణిని నియమిస్తూ ప్రభుత్వం గురువారం జీవోఆర్‌టీ 1816ను జారీ చేసింది. ప్రస్తుతం ఆమె డబ్ల్యూ అండ్ సీడబ్ల్యూ రీజినల్ జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఇప్పటివరకు డీఆర్వోగా పనిచేసిన కె.చంద్రశేఖరరావును జీఏడీలో రిపోర్టు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది.



జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పరిపాలన గాడి తప్పింది. ఉద్యోగంలో చేరిన నాటి నుంచి వివిధ హోదాల్లో ఇక్కడే పనిచేస్తూ పాతుకుపోయిన ఏడీ ఒకరు షాడో డీఈవోగా వ్యవహరిస్తున్నారు. కార్యాలయంలో పనిచేసే కొందరు ఉద్యోగులను ఓ కోటరీగా ఏర్పాటు చేసుకుని వారితోనే అన్ని పనులు చక్కబెట్టిస్తున్నారు. ప్రతి పనిలోనూ అవినీతికి పాల్పడు తున్నట్లు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నుంచి విమర్శలు ఎదుర్కొంటున్నారు. వైసీపీ పాలకులతో అంటకాగిన సదరు ఏడీ కూటమి ఎమ్మెల్యేల సిఫార్సులపై తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నారనే ఆరోపణలు మూటకట్టుకుంటున్నారు.

షాడో పాలన!

- డీఈవో కార్యాలయంలో ఏడీ వ్యవహార శైలిపై తీవ్ర విమర్శలు
- వైసీపీ పాలకులతో అంటకాగి 'కూటమి' ఎమ్మెల్యేల సిఫార్సులు బుట్టదాఖలు
- చేయి తడిపితేనే ఫైళ్లకు మోక్షం కల్పిస్తున్న 'ఏడీ' కోటరీ
- కృష్ణా నూతన డీఈవోగా పీవీజే రామారావు
- ప్రస్తుత డీఈవో తాహెరాసుల్తానాను ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఆదేశం
- కొత్త డీఈవో హయాంలోనైనా కార్యాలయ పాలన గాడినపడేనా!

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: జిల్లా విద్యాశాఖా ధికారిగా పీవీజే రామారావు నియమితులయ్యారు. నెల్లూరు డీఈవోగా పనిచేస్తున్న ఆయనను కృష్ణా డీఈవోగా ప్రభుత్వం బదిలీ చేసింది. రాష్ట్రంలోని పలు జిల్లాల విద్యాశాఖాధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం గురువారం జీవోఆర్‌టీ నంబరు 433ను జారీ చేసింది. ఇప్పటి వరకు కృష్ణా డీఈవోగా పనిచేసిన తాహెరా సుల్తానాను ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ చేసింది.

డీఈవో కార్యాలయంలో గాడి తప్పిన పాలన

జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కొంతకాలంగా పరిపాలన గాడి తప్పిందనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటివరకు పనిచేసిన డీఈవో విజయవాడ నుంచి మచిలీపట్నంలోని కార్యాలయానికి వారంలో రెండు, మూడు రోజుల మాత్రమే వచ్చేవారు. దీంతో కార్యాలయంలో పరిపాలన వ్యవహారాలు డీఈవో కార్యాలయంలో పనిచేసే ఏడీ చేతిలోకి వెళ్లిపోయాయి. ఆయన కూడా విజయవాడ నుంచి మధ్యాహ్నం 12 గంటలకు వచ్చి, సాయంత్రం ఐదు గంటలకు కార్యాలయం నుంచి వెళ్లిపోయేవారు. కలెక్టర్, జేసీ మచిలీపట్నంలోనే నివాసం ఉంటున్నా.. డీఈవో, ఏడీ మాత్రం విజయవాడలో నివాసం ఉంటూ మచిలీపట్నంలోని డీఈవో కార్యాలయానికి వచ్చేవారు. డీఈవో కార్యాలయంలో ఇద్దరు ఏడీలు పనిచేస్తుండగా, పరిపాలనా వ్యవహారాలను ఒక ఏడీనే తన చెప్పుచేతల్లో పెట్టుకున్నారని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. ఉద్యోగంలో చేరిన నాటి నుంచి డీఈవో కార్యాలయంలోనే వివిధ హోదాల్లో పనిచేసిన ఈ ఏడీ కార్యాలయంలోని అన్ని సెక్షన్ల సూపరింటెండెంట్‌లను తన అదుపాజ్ఞల్లో పెట్టుకుని పరిపాలన కొనసాగిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

అడిగినంత సమర్పిస్తేనే ఫైళ్లకు మోక్షం!

జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో తన మనుషులను కోటరీగా ఏర్పాటు చేసుకున్న సదరు ఏడీ టీచర్లకు సంబంధించి సర్వీస్ మేటర్లు, మెడికల్ బిల్లులు, డిప్యుటేషన్‌లు, సస్పెన్షన్‌లు ఎత్తివేయడం, పాఠశాలలకు గుర్తింపు ఇవ్వడం, రెన్యువల్ చేయడం ఇతరత్రా పరిపాలనా అంశాలలో తనదైన శైలిలో తెరవెనుక చక్రం తిప్పాడని టీచర్లు ఆరోపిస్తున్నారు. సిటిజన్‌చార్ట్ ప్రకారం వివిధ అంశాలకు సంబంధించిన ఫైళ్లలో కొన్నింటిని 15 రోజుల వ్యవధిలో పరిష్కరించాల్సి ఉన్నా తనను ప్రసన్నం చేసుకుని, అడిగినంత సమర్పించుకుంటేనే గాని ఈ ఏడీ సంబంధిత ఫైళ్లకు పరిష్కారం చూపేవారు కాదనే ఉప ఉపాధ్యాయులు చెప్పుకుంటున్నారు. టీచర్ల సమస్యలకు సంబంధించి కొన్ని ఫైళ్లు డీఈవో కార్యాలయంలో పెండింగ్‌లో ఉంటే వాటి సమాచారం యూనియన్ నాయకులకు ఇవ్వకుండా ఈ ఏడీ గోప్యత పాటించేవాడని యూనియన్ నేతలు ఆరోపిస్తున్నారు. డీఈవో దృష్టికి సమస్యలను తీసుకువెళ్లినా ఈ ఏడీ పలు కారణాలు చూపి పరిష్కారం కాకుండా తొక్కిపెట్టాడని యూనియన్ నాయకులు విమర్శిస్తున్నారు. కామన్ ఎగ్జామినేషన్ బోర్డు సెక్రటరీ నియామకంలోనూ ఈ ఏడీ తనదైన శైలిలో వ్యవహరించాడని టీచర్లు అంటున్నారు. పెడనలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1,600 మందిపైగా విద్యార్థులు ఉంటారు. అక్కడ కుకింగ్ ఏజెన్సీపై అనేక ఫిర్యాదులు అందాయి. వీటిపై విచారణ సక్రమంగా జరగకుండా ఈ ఏడీ, అతని వర్గీయులు అడ్డుపడటం గమనార్హం.

వైసీపీ నాయకులతో అంటకాగి..


వైసీపీ ప్రభుత్వంలో సదరు ఏడీ ఆ పార్టీ నాయకులు చెప్పిన పనులను మాత్రం చకాచకా చేసేవాడని టీచర్లు ఆరోపిస్తున్నారు. మచిలీపట్నానికి చెందిన ఒక వైసీపీ నాయకుడు నిత్యం ఏడీ చాంబరులోనే ఉండి పనులు చేయించుకునేవారని తెలిసింది. వైసీపీ నాయకులతో అంటకాగిన ఈ ఏడీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లాకు చెందిన శాసన సభ్యులు చేసిన సిఫార్సులను సైతం పక్కనపెట్టేసి, ఈ పనులు కావని ఖరాఖండిగా చెప్పడం గమనార్హం. ఎమ్మెల్యేలు డీఈవోకు పలుమార్లు చెప్పినా డీఈవోకు షాడోగా వ్యవహరించిన ఈ ఏడీ రూల్ పొజిషన్ పేరుతో ఏవేవో సాకులు చెప్పి ఈ పనులు కాకుండా అడ్డుపుల్ల వేశాడని టీచర్లు బాహాటంగా చెప్పుకుంటున్నారు.

సస్పెండ్ అయిన టీచర్లకు తిరిగి పోస్టింగ్ ఇవ్వడంలోనూ..

వివిధ కారణాలతో సస్పెన్షన్‌కు గురైన టీచర్లకు తిరిగి పోస్టింగ్ ఇవ్వడంలో ఏడీ, ఆయన కోటరీ నిబంధలకు విరుద్ధంగా తమ ఇష్టానుసారం వ్యవహరించారనే ఆరోపణలున్నాయి. కైకలూరు మండలంలో పని చేసే ఒక టీచరు వివిధ ఆరోపణలపై సస్పెండ్ అయ్యాడు. మచిలీపట్నంలో నివాసం ఉండే ఈ టీచరును దూర ప్రాంతానికి బదిలీ చేయాలి. కానీ మచిలీపట్నం పక్కనే ఉన్న గూడూరు మండలంలోని పాఠశాలకు ఆయనను పంపారు. అవనిగడ్డ, కోడూరు మండలాల్లో బాలికలను వేధిస్తున్నారనే కారణంతో ఇద్దరు టీచర్లను సస్పెండ్ చేశారు. వారిని దూరప్రాంతానికి పంపాల్సి ఉంటే అవనిగడ్డ, కోడూరు మండలాల పక్కనే ఉన్న మోపిదేవి, నాగాయలంక మండలాల్లోని పాఠశాలలకు వీరిని పంపారు. ఈ ముగ్గురు టీచర్ల వ్యవహారంలో ఏడీ, ఆయన చుట్టూ ఉన్న కోటరీ గుట్టుచప్పుడు కాకుండా తమదైన శైలిలో పని చేసుకుపోయారని టీచర్లు, యూనియన్ నాయకులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. కృష్ణా డీఈవో కార్యాలయంలో కోటరీగా ఏర్పడి పరిపాలనను తమ గుప్పిట్లో పెట్టుకున్న సదరు ఏడీ, ఆయన మనుషుల పనితీరుపై నూతన డీఈవో దృష్టిసారించి, పరిపాలనను గాడిలో పెట్టాలని టీచర్లు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరుతున్నారు.

అమరావతికి రైలు కూత

అర దశాబ్దం తర్వాత అమరావతికి రైల్వేకూత కూసింది. కొత్త రైల్వేలైన్‌కు కేంద్రం పచ్చజెండా ఊపటంతో అంతటా ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి. వచ్చేనెలలోనే శంకుస్థాపన జరిగే అవకాశాలుండటంతో ఇప్పటికే ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల పరిధిలో భూ సేకరణ పనులు ముమ్మరం చేశారు.



ఐదేళ్ల తర్వాత పట్టాలెక్కనున్న అమరావతి రైల్వేలైన్

- ఎర్రుపాలెం-నంబూరు సింగిల్ లైన్‌కు కేంద్రం ఓకే..
- నవంబరులో శంకుస్థాపన చేసే అవకాశం
- అమరావతి నుంచి కీలక ప్రాంతాలకు కనెక్టివిటీ
- మచిలీపట్నం పోర్టుతో మిగిలిన పోర్టులకు అనుసంధానం
- పరిటాలకు మహర్దశ
- ఎన్టీఆర్ జిల్లాలో 296 ఎకరాల సేకరణకు సమాయత్తం



విజయవాడ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : అమరావతికి మొత్తం 57 కిలోమీటర్ల సింగిల్ లైన్‌కు కేంద్రం ఆమోద ముద్ర వేసింది. ఈ ప్రాజెక్టుకు రూ.2,245 కోట్లను కేటాయించింది. గతంలో అమరావతిని రాజధానిగా ప్రకటించిన నేపథ్యంలో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రానికి ఈ రైల్వేలైన్‌ను ప్రతిపాదించారు. అప్పట్లో కేంద్రం కూడా సానుకూలంగా స్పందించి బడ్జెట్‌లో కేటాయింపులు చేసింది. తర్వాత ఖమ్మంజిల్లా ఎర్రుపాలెం నుంచి అమరావతి మీదుగా నంబూరు వరకు, మరో రెండు లైన్లు కలిపి రూ.2,800 కోట్లతో డీపీఆర్ తయారు చేశారు. ఎర్రుపాలెం నుంచి పెద్దాపురం, చెన్నారావుపాలెం, గొట్టుముక్కల, పరిటాల, కొత్తపేట, వడ్డమాను, తాడికొండ, కొప్పవరం, నంబూరు వరకు అమరావతి నూతన రైల్వేలైన్ అలైన్‌మెంట్‌కు రూపకల్పన చేశారు. అప్పట్లో ఆంధ్రప్రదేశ్ రైల్వే ప్రాజెక్టుల జాబితాలో దీనికి అత్యంత ప్రాధాన్యత కల్పించారు. ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి రావటంతో అమరావతి విధ్వంసం మాదిరిగానే రైల్వేలైన్‌ను కూడా పక్కన పెట్టేశారు. ప్రాధాన్యత కలిగిన రైలు ప్రాజెక్టుల జాబితాల నుంచి తొలగించారు. తాజాగా టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో ఈ రైల్వేలైన్‌కు కదలిక వచ్చింది. ఏపీ ప్రాధాన్యత ప్రాజెక్టుల జాబితాలో మళ్లీ చేరింది. 57 కిలోమీటర్ల రైల్వేలైన్‌ను రూ.2,245 కోట్లతో నిర్మించేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఇందులో ప్రధానంగా ఎర్రుపాలెం నుంచి అమరావతి మీదుగా నంబూరు వరకు 37 కిలోమీటర్ల దూరం ఉంటుంది. పెదకూరపాడు, సత్తెనపల్లి మార్గాలు కూడా కలిపితే 57 కిలోమీటర్లు అవుతుంది. ప్రస్తుతానికైతే సింగిల్ లైన్ నిర్మాణ పనులు చేపడతారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా డబ్లింగ్, ట్రిప్లింగ్‌గా విస్తరించే అవకాశం ఉంది.

ఎన్టీఆర్ జిల్లాలో 296 ఎకరాల సేకరణ

అమరావతి రైల్వేలైన్‌కు సంబంధించి జిల్లాలో 296 ఎకరాలు సేకరించాల్సి ఉంది. ఇప్పటికే ఈ ప్రక్రియ చేపట్టారు. కంచికచర్ల, వీరులపాడు మండలాల పరిధిలో భూములను సేకరించాల్సి ఉంది. ఈ రెండు మండలాల పరిధిలో పరిటాల, గొట్టుముక్కల, నరసింహారావుపాలెం, జుజ్జూరు, చెన్నారావుపాలెం, అల్లూరు, పెద్దాపురం, గూడెం మాధవరంలో భూములు సేకరించాలి.

కొండపల్లి రిజర్వు ఫారెస్టుకు ఇబ్బంది లేకుండా..

కొండపల్లి అభయారణ్యానికి ఇబ్బంది లేకుండా అమరావతి రైల్వేలైన్‌ను నిర్మించనున్నారు. పాత ప్రతిపాదన ప్రకారం ఈ లైన్ రిజర్వు ఫారెస్టులోకి కొంతమేర వచ్చింది. ప్రస్తుత అలైన్‌మెంట్‌లో ఎలాంటి వృక్షాలు, అటవీ ప్రాంతాలు దెబ్బతినకుండా రూపొందించారు.

కృష్ణానదిపై ఐకానిక్ రైల్వేబ్రిడ్జి

కృష్ణానదిపై ఐకానిక్ రైల్వేబ్రిడ్జికి రైల్వే అంగీకరించింది. నదిపై 3.2 కిలోమీటర్ల మేర ఈ బ్రిడ్జిని నిర్మిస్తారు. దీనిని ఆధునిక టెక్నాలజీతో నిర్మిస్తామని విజయవాడ డివిజన్ రైల్వే అధికారులు ప్రకటించారు.

పరిటాల వద్ద మల్టీ మోడల్ కార్గో టెర్మినల్

పరిటాల వద్ద మల్టీమోడల్ కార్గో టెర్మినల్ నిర్మించేందుకు ప్రతిపాదించారు. దీనిని ఎన్‌హెచ్-65 వెంబడి ఏర్పాటు చేస్తారు. మల్టీమోడల్ లాజిస్టిక్ పార్క్ అనేది.. రైల్వే సరుకు రవాణాతో పాటు జల, రోడ్డు రవాణా సేవలకు కేంద్రంగా అభివృద్ధి చేయనున్నారు. దీనివల్ల 17 లక్షల మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని రైల్వే అధికారులు చెబుతున్నారు.

అమరావతి టూ...

అమరావతి రైల్వేలైన్ దేశ రాజధాని ఢిల్లీ, ఆర్థిక రాజధాని ముంబయితో పాటు అన్ని రాష్ట్రాల రాజధానులతో అనుసంధానించేలా అలైన్‌మెంట్‌ను రూపొందించారు. అమరావతి నుంచి హైదరాబాద్, చెన్నై, కోల్‌కతా నగరాలకు మరింత కనెక్టివిటీ ఏర్పడుతుంది. దేశవ్యాప్తంగా మరెన్నో ఉత్తర, దక్షిణాది రాష్ట్రాలకు అనుసంధానమవుతుంది.

పర్యాటకంగా ప్రాధాన్యం

అమరావతి రైల్వేలైన్ పర్యాటకంగా కూడా ప్రధానపాత్ర పోషించనుంది. పరిటాల ఆంజనేయస్వామి ఆలయంతో పాటు అమరావతిలోని అమర లింగేశ్వరస్వామి, వెంకటేశ్వరస్వామి ఆలయాలు, ఇతర సందర్శనీయ ప్రాంతాలకు పెద్దసంఖ్యలో పర్యాటకులు వచ్చే అవకాశాలున్నాయి.

మచిలీపట్నం పోర్టుకు అనుసంధానం

అమరావతి రైల్వేలైన్ మచిలీపట్నం పోర్టుకు అనుసంధానమయ్యేలా అలైన్‌మెంట్‌ను రూపొందించారు. దీంతో రానున్న రోజుల్లో రాజధానిలో మచిలీపట్నం పోర్టు కీలకపాత్ర పోషించనుంది. ఒక్క మచిలీపట్నం పోర్టుతోనే కాకుండా కృష్ణపట్నం, కాకినాడ పోర్టులకు కూడా అనుసంధానమవుతుంది.



డేంజర్ బెల్స్! 6లో

రీచ్‌ల్లో యంత్రాలకు అనుమతుల్లేవు 6లో

గ్రహణం వీడింది! 6లో

పీఎం సూర్యఘర్‌కు సబ్సిడీ, రుణాలు

డేంజర్ బెల్స్!



క్రిష్ణా ఈస్ట్ కెనాల్ వద్ద కుంగిన ప్రాంతంలో శాశ్వత రక్షణ చర్యలు వదిలి రేకులతో తాత్కాలిక ఏర్పాట్లు



ప్రకాశం బ్యారేజీ

- ప్రకాశం బ్యారేజీ చుట్టూ ప్రమాద ఘంటికలు
- ఒరుగుతున్న బ్యారేజ్ రెయిలింగ్
- కోతకు గురైన సీతానగరం రహదారి.. కూలిన ప్రహరీ
- కూలిపోయిన కేఈఎం కాల్వ ప్రహరీ
- బ్యారేజ్ చుట్టుపక్కల నిర్మాణాలపై వరదల ఎఫెక్ట్
- ఐదేళ్లుగా నిర్వహణను వదిలేసిన వైసీపీ

ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలను అనుసంధానం చేసి, అన్నదాతల అవసరాలను తీర్చడంతోపాటు ఉమ్మడిజిల్లా ప్రజలగొంతు తడుపుతున్న ప్రకాశం బ్యారేజ్ చుట్టూ ప్రమాదకర పరిస్థితులు కనిపిస్తున్నాయి. నదిని, నదికి పక్క నుంచి ప్రవహించే కాల్వలను ఆనుకుని ఉన్న ప్రహరీలు కుంగుతున్నాయి. కొన్ని ప్రదేశాల్లో ఈ ప్రహరీలు కూలిపోయాయి. ప్రస్తుత పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. మొత్తం మూడు ప్రదేశాల్లో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ప్రకాశం బ్యారేజ్ దిగువన ఉన్న వెప్రాన్‌కు చెంతనే సీతానగరం వైపున రైల్వే బ్రిడ్జి దిశగా వెళ్లడానికి సీసీ రోడ్డును నిర్మించారు. బ్యారేజ్ గేట్లను ఎత్తినప్పుడు ఈ రహదారి చెంత నుంచి నీరు దిగువకు ప్రవహిస్తుంది. నదికి పక్కన ఏర్పాటు చేసిన కట్టపై సీసీ రోడ్డును నిర్మించారు. ఈ మార్గంలో వెళ్లే వాహనాలకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా రక్షణ గోడను నిర్మించారు. సీతానగరం కొండలు దాటిన తర్వాత నుంచి రైల్వే బ్రిడ్జి వరకు స్నానాల ఘాట్లు ఉన్నాయి. ప్రకాశం బ్యారేజ్‌కి వరదలు తీవ్రంగా రావడంతో ఇక్కడున్న సీసీ రోడ్డు కోతకు గురవుతోంది. 2019లో రెండుసార్లు ప్రకాశం బ్యారేజ్‌కి భారీగా వరదలు వచ్చాయి. ఈ ఏడాది సెప్టెంబరు నెలలో రికార్డు స్థాయిలో11.45లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. ఇలా వరదలు భారీగా వచ్చినప్పుడల్లా రహదారికి కోత పెరుగుతోంది. దీనితో ఇక్కడున్న రహదారి ఒక వైపునకు కుంగిపోతోంది. దీనిపై నిర్మించిన రక్షణ గోడ వరదల సమయం నుంచి నది వైపునకు ఒరిగిపోయి ఉండేది. తాజాగా ఈ ప్రహరీ కొంతభాగం ముక్కలుగా కూలిపోయింది. సుమారుగా 150 మీటర్ల మేర రక్షణ గోడ పడిపోయింది. కోత పెరగడంతో గోడ కూలిపోయిందని స్థానికులు చెబుతున్నారు. జలవనరుల శాఖ అధికారులు మాత్రం ఏదో గుర్తుతెలియని వాహనం రాత్రి సమయాల్లో ఢీకొట్టిందని అనుమానిస్తున్నారు. ప్రహరీ కూలిపోయిన ప్రదేశాలను నది పరిరక్షణ విభాగ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిరణ్, ప్రకాశం బ్యారేజ్ జేఈ రాజేష్ పరిశీలించారు.

కేఈ కాల్వ దగ్గర అంతే...

ప్రకాశం బ్యారేజ్ నుంచి కాల్వలకు రెండు విధాలుగా నీటిని విడుదల చేస్తారు. ముందుగా వినాయకుడి ఆలయానికి సమీపం నుంచి ప్రవహించే కృష్ణా తూర్పు ప్రధాన కాల్వపై ఉన్న లాక్ నుంచి దిగువన గల డెల్టాకు నీరు ఇస్తారు. తర్వాత సీతానగరం వైపున ఉన్న లాక్ వద్ద నుంచి పశ్చిమ డెల్టాకు నీటిని విడుదల చేస్తారు. ప్రకాశం బ్యారేజ్‌ను ఆనుకుని ప్రవహించే తూర్పు ప్రధాన తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రం వద్దకు వచ్చే సరికి మూడు కాల్వలుగా చీలిపోతుంది. ఈ తూర్పు ప్రధాన కాల్వకు ఇరిగేషన్ అధికారులు సేఫ్టీ వాల్‌ను నిర్మించారు. ఈ కాల్వకు వినాయకుడి ఆలయానికి మధ్య నుంచి వీఎంసీ అధికారులు రహదారిని నిర్మించారు. ఈ రహదారి కొత్త లాక్ వద్ద కలుస్తుంది. వినాయకుడి ఆలయం నుంచి లాక్ వరకు రహదారి వెంబడి అధికారులు ఒక గోడను నిర్మించారు. కొన్ని సంవత్సరాలుగా ఈ గోడ శిథిలావస్థకు చేరింది. ఈ రహదారిలో జనసంచారం తక్కువగా ఉండడంతో వీఎంసీ అధికారులు బహిరంగ మూత్రవిసర్జన బిన్‌లను ఏర్పాటు చేశారు. ఇక్కడ రహదారికి, దానిపై నిర్మించిన గోడకు మధ్య కొన్నిచోట్ల ఖాళీలు ఏర్పడ్డాయి. మరికొన్ని చోట్ల పగుళ్లు ఉన్నాయి. రోజులు గడుస్తున్న కొద్దీ ఈ ఖాళీలు బాగా పెరుగుతున్నాయి. తాజాగా బహిరంగ మూత్రవిసర్జన బిన్‌లు ఏర్పాటు చేసిన ప్రదేశంలో ఉన్న ప్రహరీ కొంతభాగం కూలిపోయింది. దీనితో వీఎంసీ అధికారులు ఇక్కడ కాల్వకు రహదారికి మధ్య రేకులను అడ్డుగా ఏర్పాటు చేశారు. ఇక్కడ కాల్వ జలవనరుల శాఖ పరిధిలో ఉన్నా, కూలిపోయిన గోడ, దాన్ని ఆనుకుని ఉన్న రహదారి తమ పరిధిలోకి రాదని ఆ శాఖాధికారులు చెబుతున్నారు. దీనికి తక్కువ ఎత్తులో మెట్లుగా నిర్మించిన సేఫ్టీ వాల్ మాత్రమే తమ పరిధిలోకి వస్తుందని స్పష్టం చేస్తున్నారు.

ప్రమాదకరంగా రెయిలింగ్..



ప్రకాశం బ్యారేజ్‌పై ఉన్న రహదారికి ఇరువైపులా సిమెంట్ రెయిలింగ్ ఏర్పాటు చేశారు. ఒక రెయిలింగ్ నది దిగువకు ప్రవహిస్తున్న వైపు ఉంటుంది. మరో రెయిలింగ్ గేట్లుకు చెంతనే ఉంటుంది. సందర్శకులు వారాంతాల్లో వాటిని ఆనుకుని ఫొటోలు, సెల్ఫీలు తీసుకుంటారు. శని, ఆదివారాల్లో బ్యారేజ్ పైకి అటు తాడేపల్లి, సీతానగరం, ఉండవల్లి వైపు నుంచి, ఇటు విజయవాడ వైపు నుంచి సందర్శకులు వెళ్తుంటారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో బ్యారేజ్ నిర్వాహణను మొత్తం గాలికి వదిలేసింది. గేట్లు, గొలుసులు, మోటార్ల నిర్వాహణకు చిల్లిగవ్వను విదల్చలేదు. ఆ సమయంలో బ్యారేజ్‌పై ఉన్న ఫుట్‌పాత్ పాడైపోయింది. కొన్ని చోట్ల సిమెంట్ పలకలు ముక్కలైపోయాయి. అదేవిధంగా 39వ నంబరు ఖానా ఎదురుగా వెప్రాన్ వైపున ఉన్న రెయిలింగ్ విరిగిపోయింది. సందర్శకులు ఇక్కడికి వెళ్లకుండా ఇరిగేషన్ అధికారులు అడ్డుగా కర్రలు కట్టారు. బ్యారేజ్‌కు మరమ్మతులు చేయడానికి ప్రతిపాదనలు తయారు చేసి అప్పటి ప్రభుత్వానికి పంపారు. అయినా సర్కారులో చలనం కలగలేదు. కర్రలు ట్రాఫిక్‌కు అంతరాయంగా ఉంటున్నాయని భావించి రెయిలింగ్ విరిగిపోయిన భాగంలో సిమెంట్‌తో ప్లాస్టరింగ్ చేయించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫుట్‌పాత్‌పై కొత్త సిమెంట్ పలకలను ఏర్పాటు చేశారు. రెయిలింగ్ మాత్రం నది వైపునకు ఒరిగిపోతోంది.

ప్రతిపాదనలు తయారు చేస్తున్నాం

- రాజేష్, ప్రకాశం బ్యారేజ్ జేఈ

సీతానగరం వైపున ఉన్న రోడ్డు ఇటీవల వచ్చిన వరదలకు కోతకు గురైంది. దీనిపై నిర్మించిన ప్రహరీ కూలిపోయింది. ఈ ప్రదేశాన్ని పరిశీలించాం. ప్రతిపాదనలు తయారు చేస్తున్నాం. అదేవిధంగా బ్యారేజ్ పైన ఉన్న రెయిలింగ్‌ను మార్పు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. కేఈ కెనాల్ వైపున కూలిపోయిన ప్రహరీ ఇరిగేషన్ శాఖ పరిధిలోకి రాదు. ఇది పూర్తిగా వీఎంసీ పరిధిలో ఉంటుంది.



పశుగణన పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు

నేటి నుంచి జాతీయ పశుగణన

వన్‌టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 25 నుంచి 21వ జాతీయ పశుగణన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ నిధిమీనా తెలిపారు. జేసీ క్యాంపు కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో పశుగణన వాల్ పోస్టర్లను, నిబంధనల పుస్తకాలను ఆవిష్కరించి ట్రావెలింగ్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈనెల 25వ తేదీ నుంచి నాలుగు నెలల పాటు పశుగణన నిర్వహిస్తున్నామన్నారు. 241 మంది పశుగణనకర్తలు, 47 మంది పర్యవేక్షకులు పనిచేస్తారని తెలిపారు. ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక గణన కర్త ఉంటారని, 20 మండలాలు, పట్టణ ప్రాంతాల్లో పశుగణన జరుగుతుందని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలో 7,02,900 కుటుంబాలను సర్వేచేసి గేదెలు, ఆవులు, కోళ్లు, గొర్రెలు, మేకలు, 16 రకాల పశువులు, జీవాల సంఖ్యను లెక్కించి యాప్‌లో నమోదు చేస్తారన్నారు. పశుగణన ఆధారంగా నిధులు, వ్యాధినిరోధక టీకాలు, నట్టల వ్యాధి టీకాలు వస్తాయని తెలిపారు. పశు యజమానులు గణనకర్తలకు కచ్చితమైన వివరాలు ఇవ్వాలని ఆమె పేర్కొన్నారు. పశుసంవర్థక శాఖ సంయుక్త సంచాలకులు ఎం.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లిలో ఇసుక రీచ్‌లు లేవు

» తహసీల్దార్ వనజాక్షి



చల్లపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి మండలంలో ఇసుక రీచ్‌లు లేవనీ, ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని చల్లపల్లి తహసీల్దార్ డి.వనజాక్షి హెచ్చరించారు. చల్లపల్లి ఎస్‌ఐ పిఎస్‌వి.సుబ్రహ్మణ్యంతో కలిసి గురువారం విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం గుర్తించిన రీచ్‌ల నుంచీ మాత్రమే ఉచిత ఇసుకను తీసుకువెళ్లాలన్నారు. చల్లపల్లి మండలం సీఆర్‌జడ్ పరిధిలో ఉండటంతో ఇసుక తవ్వకాలకు అనుమతులు లేవన్నారు. ఎడ్లబండ్లతో సైతం ఇసుక రవాణా చేసేందుకు వీలులేదని స్పష్టం చేశారు. ఘంటసాల మండలం శ్రీకాకుళంలో ఇసుక రీచ్‌ను గుర్తించారనీ, త్వరలో అక్కడ ఏర్పాటుచేసే స్టాక్‌పాయింట్ నుంచి మాత్రమే ఇసుక తెచ్చుకోవాల్సి ఉంటుందని తెలిపారు. సీఆర్‌జడ్ పరిధిలో ఇసుక తవ్వకాలకు పాల్పడితే కఠినతరంగా వ్యవహరిస్తామన్నారు.

రేషన్ డీలర్లకు మళ్లీ నోటీసులు!

మొగల్రాజపురం, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి) : రేషన్ షాపుల విభజనపై కొందరు డీలర్లు హైకోర్టును ఆశ్రయించడంతో కమిషనర్ ఆదేశాల మేరకు మళ్లీ డీలర్లకు తాజాగా మరోసారి నోటీసులు జారీచేశారు. గతంలో ఇచ్చిన నోటీసులకు అభ్యంతరాలు తెలిపినా పరిష్కరించకుండా ఎండార్స్‌మెంట్‌లు ఇవ్వడంతో వాటిని రద్దు చేయాలని డీలర్లు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో పౌరసరఫరాల కమిషనర్ డీలర్లకు మరోసారి నోటీసులు ఇచ్చారు. 7 రోజుల తరువాత షాపుల విభజన గురించి ప్రభుత్వ ఆదేశాలు, సర్క్యులర్‌లను ఉటంకిస్తూ రూల్ పోజిషన్ తెలుపుతూ విభజనకు ముందు, తరువాత వారి దుకాణాల్లో ఎన్ని కార్డులు ఉన్నాయో ఖచ్చితంగా డీలర్‌లకు తెలిపి ప్రొసీజర్ ప్రకారం ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ మేరకు జిల్లాలో కొన్ని మండలాల్లో నోటీసులు జారీచేశారు.

ఎన్టీఆర్ జిల్లా డీఆర్వోగా లక్ష్మీనరసింహం

» వల్లభనేని శ్రీనివాసరావు బదిలీ

విజయవాడ అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌ఓ)గా ఎం లక్ష్మీనరసింహంను ప్రభుత్వం గురువారం నియమించింది. నరసింహం ప్రస్తుతం సర్వే సెటిల్‌మెంట్-ల్యాండ్ రికార్డుల కమిషనరేట్‌లో ఎస్‌జేడీగా పనిచేస్తున్నారు. కీలకమైన ఎన్టీఆర్ జిల్లాకు ఆయన్ను బదిలీ చేయటం గమనార్హం. ప్రస్తుతం డీఆర్వోగా పనిచేస్తున్న వల్లభనేని శ్రీనివాసరావును ప్రభుత్వానికి రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశించింది. శ్రీనివాసరావు ఎన్నికల ముందు డీఆర్వోగా వచ్చారు.

ఖతార్ తెలుగు సదస్సుకు మండలికి ఆహ్వానం

అవనిగడ్డ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఖతార్‌లో నవంబర్ 22, 23 తేదీల్లో జరుగనున్న ప్రపంచ సాహితీ సదస్సుకు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌కు ఆహ్వానం అందింది. వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా అధ్యక్షుడు వంగూరి చిట్టెన్ రాజు బుద్ధప్రసాద్‌కు ఈ ఆహ్వానాన్ని అందజేశారు. వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, దోహాలోని ఆంధ్ర కళావేదిక, ఖతార్ ఉమ్మడి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో తెలుగు భాషా సాహిత్యంపై సందేశమివ్వాల్సిందిగా బుద్ధప్రసాద్‌ను నిర్వాహకులు కోరినట్టు గాంధీక్షేత్ర వర్గాలు తెలిపాయి.

షటిల్ బ్యాడ్మింటన్ రన్నర్స్ ఏఎన్ఆర్ విద్యార్థులు

గుడివాడ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కృష్ణా విశ్వవిద్యాలయ అంతర కళాశాలల షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఏఎన్ఆర్ కళాశాల విద్యార్థులు ఎన్.సతీష్‌కుమార్, డి.సాయిచరణ్, ఎం.వేణుగోపాలుడు, పి.శ్యాంప్రసాద్, బి.మనోజ్, వి.శ్రీకాంత్, వి.సాయి జట్టు ద్వితీయ స్థానం సాధించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్ తెలిపారు. గురువారం కళాశాల ఆవరణలో జట్టు సభ్యులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు.

రీచ్‌ల్లో యంత్రాలకు అనుమతుల్లేవు

» కృష్ణా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లాలోని ఇసుకరీచ్‌ల్లో యంత్రాలతో ఇసుకతవ్వకాలకు అనుమతులు లేవని కలెక్టర్ బాలాజీ అన్నారు. కలెక్టరేట్‌లో జేసీ గీతాంజలిశర్మ, ఎస్పీ ఆర్.గంగాధరరావుతో కలిసి గురువారం ఇసుక రవాణాదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నేషనల్‌గ్రీన్ ట్రిబ్యునల్, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రీచ్‌లలో జేసీబీలు, పొక్లెయినర్లను ఇసుక తవ్వకాలకు ఉపయోగించరాదన్నారు. మాన్యువల్‌గానే తవ్వకాలు జరపాలని ఆదేశించారు. ఈ విషయంలో ఎలాంటి మినహాయింపులు ఉండవని, నిబంధనలు పాటించాల్సిందేనన్నారు. ఇసుక రేవుల్లో యంత్రాలను ఉపయోగిస్తే వాటిని సీజ్ చేస్తామని హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

లే అవుట్లకు అనుమతులు తప్పనిసరి

మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా) పరిధిలో నిర్మాణం చేసే భవనాలు, లేఅవుట్లకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని కలెక్టర్ బాలాజీ అన్నారు. ముడా టౌన్ ప్లానింగ్ కార్యకలాపాలపై గురువారం ముడా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్, పెడన పురపాలకసంఘం, సీఆర్‌డీఏ పరిధిలో లేని అన్ని మండలాలు ముడా పరిధిలోకి వస్తాయన్నారు. ముడాపరిధిలో నిర్మాణం జరిగే అన్ని భవనాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. పంచాయతీలలో భవనాల నిర్మాణం, లేఅవుట్‌లను పర్యవేక్షించేందుకు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ప్రణాళిక కార్యదర్శులకు లేఅవుట్‌లు, భవనాలకు అనుమతులు మంజూరుచేసే విషయంపై వర్క్‌షాప్ నిర్వహించి తగిన శిక్షణ ఇవ్వాలని ముడా ఇన్‌చార్జి వీసీ, జేసీ గీతాంజలి శర్మకు కలెక్టర్ సూచించారు. సమావేశంలో మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ బాపిరాజు, డీపీవో అరుణ, ముడా ప్లానింగ్ అధికారి శాంతిలత, ముడా డెప్యూటీ కలెక్టర్‌లు రవిశంకర్, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్‌కు సబ్సిడీ, రుణాలు

» జిల్లాలో పథకం అమలుకు 36 బృందాలు

» ఎలక్ట్రికల్ ఎస్ఈ సత్యానందం



మచిలీపట్నం టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పీఎం సూర్యఘర్ కార్యక్రమంలో భాగంగా సౌర విద్యుత్ పథకం కింద విద్యుత్ కనెక్షన్ తీసుకునే వినియోగదారులకు సబ్సిడీతో పాటు బ్యాంకు రుణ సౌకర్యం అందిస్తామని ఎలక్ట్రికల్ ఎస్ఈ ఎం.సత్యానందం పేర్కొన్నారు. గురువారం ఎస్ఈ కార్యాలయంలో విద్యుత్‌శాఖ డీఈలు, ఏడీలతో సోలార్ ఎనర్జీ వినియోగంపై వినియోగదారులకు అవగాహన కల్పించడంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎస్ఈ మాట్లాడుతూ, ప్రతి ఇంటిని సూర్యఘర్ పథకంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. కృష్ణాజిల్లాలోని 36 సెక్షన్లలో 36మంది సెక్షన్ ఆఫీసర్లు, 72 మంది ఇతర సిబ్బంది బృందాలుగా ప్రతీ ఇంటికి వెళ్లి వినియోగదారులను చైతన్య పరుస్తారన్నారు. కిలోవాట్ పవర్ కోరుకునే వారికి రూ. 30వేలు, రెండు కిలోవాట్ పవర్ కోరుకునే వారికి రూ.60 వేలు, మూడు కిలోవాట్లు విద్యుత్ కావాలనుకునే వారికి రూ.78 వేలు సబ్సిడీ ఇస్తారన్నారు. పీఎం సూర్య పథకంలోకి వచ్చిన వారి మిగులు విద్యుత్‌ను విద్యుత్ శాఖ కొనుగోలు చేసి బ్యాంకు అకౌంట్‌కు ఆ సొమ్మును జమ చేస్తారన్నారు. సోలార్ కనెక్షన్ తీసుకున్న వినియోగదారునికి ప్రస్తుతం ఉన్న ఎనర్జీ మీటర్ స్థానంలో బైడైవర్షన్ మీటర్‌ను పెడతారన్నారు. లక్ష రూపాలయకు రూ.80 వేలు బ్యాంకు రుణం ఇస్తుందని, మిగిలిన రూ.20 వేలు కట్టిన వెంటనే కనెక్షన్ ఇస్తారన్నారు. కార్యక్రమంలో డీఈలు జీబీ శ్రీనివాసరావు, డి.కృష్ణ నాయక్, బీపీ సుధాకర్‌లతో పాటు ఏడీలు, ఏఈలు పాల్గొన్నారు.

సైబర్ కట్టడికి సహకరించండి

» సీపీ రాజశేఖరబాబు

విజయవాడ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాలను కట్టడి చేయడానికి బ్యాంకర్లు పోలీసులకు సహకరించాలని ఎన్టీఆర్ పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు అన్నారు. పోలీసులు, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేసినప్పుడే ఈ నేరాలకు అడ్డుకట్ట పడుతుందని స్పష్టం చేశారు. కమిషనరేట్ పరిధిలోని అన్ని బ్యాంకర్ల మేనేజర్లతో కమిషనర్ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా హడావుడిగా వచ్చి అధిక మొత్తంలో లావాదేవీలు చేస్తున్న వారిపై ఒక కన్నేసి ఉంచాలన్నారు. వారి ఖాతాలను పరిశీలించాలన్నారు. ఆ ఖాతాల నుంచి డబ్బులు ఏ ఖాతాలోకి వెళ్తున్నాయో తెలుసుకోవాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలు గురించి వివరించారు. ఎవరైనా ఖాతాదారులు వచ్చి తమకు తెలియకుండా డబ్బులు బదిలీ అయ్యాయని ఫిర్యాదు చేసినప్పుడు అవి ఏ ఖాతాకు వెళ్లాయో వివరాలు తెలియజేయాలని సూచించారు. ఈ నేరాల్లో బాధితుల్లో లక్షలాది రూపాయలను కోల్పోతున్నారని, వారిపట్ల మానవ తాదృక్పథంతో వ్యవహరించాలని అభిప్రాయపడ్డారు. అనుమానాస్పదంగా ఉన్న లావాదేవీలపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఖాతాల్లో డబ్బులు కోల్పోయిన బాధితులు వచ్చినప్పుడు వారికి 1930 టోల్‌ఫ్రీ నంబరును ఇవ్వాలని చెప్పారు. సమావేశంలో క్రైమ్స్ డీసీపీ తిరుమలేశ్వరరెడ్డి, సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్లు గుణరాము, పలివెల శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ రాజశేఖరబాబు

పెన్షనర్ల కార్పొరేషన్ ఏర్పాటు చేయండి

» సీఎంకు ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ విజ్ఞప్తి

అమరావతి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరినట్టు ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బరాయన్, పెద్దన్న గౌడ్, నాగభూషణం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షనర్ల సంక్షేమం కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరామన్నారు. ప్రతి నెల ఒకటవ తేదీకి పెన్షన్ల చెల్లింపు అన్నది గత ప్రభుత్వంలో అసాధ్యమైందని సమయానికి పెన్షన్‌రాక పెన్షనర్స్ చాలా ఇబ్బందులకు గురైయ్యారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత నెల నెలా పెన్షన్స్‌ను గత ఐదు నెలలుగా సకాలంలో నెల మొదటి తారీఖున పెన్షన్లు ఇస్తున్నందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వం తగ్గించిన అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌ను పాత స్లాబుల ప్రకారం చెల్లించాలని కోరారు. పెన్షనర్లకు హెల్త్ ఇన్సూరెన్స్ స్కీమ్ ప్రవేశపెట్టాలని కోరినట్టు తెలిపారు.

సీఎం నివాసం వద్ద కొండచిలువ కలకలం

అమరావతి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉండవల్లిలోని ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసం వద్ద కొండచిలువ కళేబరం కలకలం రేపింది. చంద్రబాబు నివాసానికి సమీపంలోని పార్కింగ్ ఏరియాలో మీడియా పాయింట్ కంటైనర్ వద్ద కొండచిలువ ఏదో జంతువును మింగి ఊపిరాడక చనిపోయింది. చచ్చిపడి ఉన్న కొండచిలువను గుర్తించిన మీడియా సిబ్బంది సీఎం భద్రతా సిబ్బందికి సమాచారమిచ్చారు. అనంతరం కొండచిలువ కళేబరాన్ని అక్కడి నుంచి తొలగించారు.

ప్రాసిక్యూషన్స్ డైరెక్టర్ రాజీనామా ఆమోదం

అమరావతి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రాసిక్యూషన్స్ డైరెక్టర్ జల్లా సుదర్శనరెడ్డి రాజీనామాను ప్రభుత్వం ఆమోదించింది. కడప జిల్లాకు చెందిన న్యాయవాది సుదర్శనరెడ్డిని 2021, జూన్ 15న వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రాసిక్యూషన్స్ డైరెక్టర్‌గా నియమించింది. ఈ ఏడాది జూన్ మొదటి వారంలో వెలువడిన ఎన్నికల ఫలితాల్లో వైసీపీ ఓటమి పాలైంది. ఈ నేపథ్యంలో జూన్ 10న తన రాజీనామాను సమర్పించిన సుదర్శనరెడ్డి వెంటనే ఆమోదించాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరారు. ఆయన రాజీనామాకు ప్రభుత్వం ఆమోదం తెలపడంతో గురువారం అధికారంగా ఉత్తర్వులు వెలువడ్డాయి.

ఉద్యోగ భద్రత కల్పించండి

» ముఖ్యమంత్రికి సీపీఐ రామకృష్ణ లేఖ

అమరావతి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ ఫీల్డ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించేందుకు చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు గురువారం ఆయన లేఖ రాశారు. "వైద్య గ్రాడ్యుయేషన్, పోస్టు గ్రాడ్యుయేషన్, నర్సింగ్, బీ ఫార్మసీ వంటి ఉన్నత విద్యార్హతలున్న వారు ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్‌లో వైద్యమిత్రలుగా, టీం లీడర్లుగా, జిల్లా మేనేజర్లుగా అసోసియేట్లుగా గత 18 సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతో సేవలందిస్తున్నారు. ఎన్టీఆర్ వైద్యసేవను ట్రస్టు పరిధి నుంచి తప్పించి, ఆరోగ్య బీమా అమలు పథకం కింద అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది. దీంతో ఆ ట్రస్టులో పని చేస్తున్న సిబ్బంది తమ ఉద్యోగాలు కోల్పోవాల్సి వస్తుందేమోనని ఆందోళన చెందుతున్నారు. కాబట్టి వారికి ఉద్యోగ భద్రత కల్పించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలి" అని రామకృష్ణ తన లేఖలో డిమాండ్ చేశారు.

గ్రహణం వీడింది!

వారంతా ఔట్‌సోర్సింగ్‌లో పనిచేసే చిరుద్యోగులు.. టీడీపీ ప్రభుత్వంలో నియమితులైన పంచాయతీరాజ్ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది. గత వైసీపీ పాలనలో వీరిపైనా కక్ష సాధింపులు తప్పలేదు. ఉద్యోగ భద్రత లేక, నెలల తరబడి వేతనాలు అందక ఆయా కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. మళ్లీ కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో వారి పోరాటం ఫలించింది. వెతలు తొలగిపోయాయి. వారిని డ్వామాకు బదలాయించటంతో ఉద్యోగ భద్రతతో పాటు ప్రతి నెల జీతాలు అందనున్నాయి. పెండింగ్ వేతనాల నిధులు విడుదలతో వారి ఆనందానికి అవధుల్లేవు.

- వైసీపీ పాలనలో వీధిన పడిన చిరుద్యోగులు
- కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో ఫలించిన పోరాటం
- ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు డ్వామాకు బదలాయింపు

నేతల హామీతో చిగురించిన ఆశలు



మంత్రి నారా లోకేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, సమస్యలు పరిష్కరించాలని మంత్రి అచ్చెన్నాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు (ఫైల్)

(ఆంధ్రజ్యోతి - కంచికచర్ల)

పంచాయతీరాజ్ శాఖలో 2009 నుంచి ఔట్‌సోర్సింగ్ విధానంలో రాష్ట్రవ్యాప్తంగా 600 మంది, ఉమ్మడి కృష్ణా జిల్లాలో 85 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. మండల పరిషత్ కార్యాలయాల్లో పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీర్లకు సహాయకులు (టెక్నికల్ అసిస్టెంట్లు), కంప్యూటర్ ఆపరేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా, ఈఎన్‌సీ కార్యాలయంలో డ్రైవర్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రారంభంలో వీరి జీతం నెలకు రూ. 5,120. అంచెలంచెలుగా ప్రస్తుతం నెలకు రూ.16వేలకు చేరింది. ఎన్ఆర్ఈజీఎస్ అడ్మిన్ ఫండ్ నుంచి వీరిజీతాలు చెల్లించేవారు. మొదట్లో సక్రమంగానే జీతాలు ఇచ్చారు. 2009-14లో టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రన్నబాట పథకంలో భాగంగా గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణంలో వీరు కీలకపాత్ర పోషించారు.

వైసీపీ ప్రభుత్వం కక్ష సాధింపు..

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చిరుద్యోగులకు కష్టాలు మొదలయ్యాయి. సక్రమంగా జీతాలు ఇవ్వక వీరి పట్ల ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణిలో వ్యవహరించింది. దీనికితోడు 2019లో సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి, ఇంజనీరింగ్ అసిస్టెంట్లను కూడా నియమించటంతో వీరి పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఒకదశలో వీరిని ఇళ్లకు పంపించేందుకు నాటి పాలకులు ప్రయత్నించారు. మంత్రులను, ముఖ్యమంత్రిని కలిసి విన్నవించినప్పటికీ ప్రయోజనం శూన్యం. చిరుద్యోగులు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు వీరికి అనుకూలంగా తీర్పు ఇచ్చినప్పటికీ వైసీపీ ప్రభుత్వం పంతం వీడలేదు. నెల నెలా జీతాలు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టింది. ఒక్కోసారి పది నెలలకు ఇచ్చేవారు. దీంతో ఔట్‌సోర్సింగ్ కుటుంబాలు పడిన ఇబ్బందులు వర్ణనాతీతం.

కూటమి ప్రభుత్వం రాకతో మళ్లీ ఆశలు..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడగానే ఉద్యోగుల్లో ఆశ చిగురించింది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేశ్ వీరి దుస్థితిపై సానుకూలంగా స్పందించారు. కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, మంత్రి అచ్చెన్నాయుడు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కూన రవికుమార్, కోండ్రు మురళి తదితరులు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు అండగా నిలిచారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి విజయం చేకూర్చటంలో కీలకపాత్ర పోషించారు.

డ్వామాలోకి బదలాయింపు

డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ అధికారులతో సమీక్షించి సానుకూల నిర్ణయం తీసుకోవడంతో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నిరీక్షణ ఫలించింది. వీరిని గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలోని డ్వామాలోకి బదలాయించారు. అక్కడి నుంచే ప్రతినెల జీతాలు చెల్లించే విధంగా ఆదేశాలు జారీ చేశారు. పెండింగ్ పడిన 15 నుంచి 18 నెలల జీతాలకు సంబంధించి రూ. 25 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఉద్యోగుల కష్టాలు తొలగిపోనున్నాయి. ఉద్యోగుల సర్టిఫికెట్లను డ్వామా అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు పరిశీలిస్తున్నారు.

కూటమి ప్రభుత్వం భద్రత కల్పించింది


- వెనిగండ్ల చైతన్య, ఉమ్మడి కృష్ణా ప్రధాన కార్యదర్శి



దశాబ్దంన్నర నుంచి పనిచేస్తున్నా ఉద్యోగ భద్రత లేకుండా పోయింది. సక్రమంగా జీతాలు రావటం లేదు. పది నెలలకొకసారి ఇచ్చేవారు. కుటుంబాల ఇబ్బందులు వర్ణనాతీతం. కూటమి ప్రభుత్వం రాగానే మాగోడు పట్టించుకున్నారు. డ్వామాకు బదలాయించి, ఉద్యోగ భద్రత కల్పించారు. బకాయిలు విడుదల చేసి, ప్రతి నెల జీతాలు ఇవ్వాలని ఆదేశించారు. ఎంతో సంతోషంగా ఉంది.

వైసీపీ ప్రభుత్వం వేధింపులకు గురిచేసింది

- జక్కుల ఆదినారాయణ, యూనియన్ జిల్లా నేత



కూటమి ప్రభుత్వ హయాంలో సిమెంట్ రోడ్ల నిర్మాణంలో క్రియాశీలక పాత్ర పోషించామన్న నెపంతో వైసీపీ ప్రభుత్వం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను తీవ్రంగా వేధించింది. జీతాలు ఇవ్వక పోగా, ఉద్యోగాల నుంచి తొలగించేందుకు ప్రయత్నించింది. కూటమి ప్రభుత్వం మా కలను సాకారం చేసింది. సీఎం, డిప్యూటీ సీఎంతో పాటుగా పాలకులందరూ సమస్యలను పరిష్కరించేందుకు చేసిన కృషి మరువలేనిది.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	131,140, 151
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 540

పంచారామాలకు ప్రత్యేక బస్సులు

ఉయ్యూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం పురస్కరించుకుని పంచారామా క్షేత్రాల దర్శించుకునేవారి కోసం నవంబరు 3 నుంచి ప్రతి ఆది, సోమవారాల్లో ఉయ్యూరు ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు డిపో మేనేజర్ కెఎస్ఆర్‌కు ప్రసాద్ తెలిపారు. నవంబరు 3, 4, 10, 11, 17, 18, 24, 25 తేదీల్లో ప్రత్యేక బస్సు సర్వీసులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. రాత్రి 11- 45 గంటలకు బస్‌స్టాండ్ నుంచి బయలుదేరతాయని, సూపర్ లగ్జరీ బస్సుకు చార్జి ఒక్కరికి రూ. 1200, ఎక్స్‌ప్రెస్‌కు రూ. 1000ని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 7382893468, 8919366868 సెల్ నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.


ఎమ్మెల్సీ ఓటు నమోదుపై అవగాహన కల్పిస్తున్న సాయికల్యాణి, తెలుగు మహిళలు

మేధావుల ఓటుతో రాష్ట్రాభివృద్ధి

హనుమాన్‌జంక్షన్/ రూరల్ అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : రానున్న కృష్ణా - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ (రాజా)ను గెలిపించాలని తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయి కల్యాణి ఓటర్లుకు విజ్ఞప్తి చేశారు. గురువారం హనుమాన్‌జంక్షన్‌లోని పలు వీధుల్లో ఎమ్మెల్సీ ఓటు నమోదు కార్యక్రమంపై ఇంటింటా విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఓటు నమోదుపై పట్టభద్రులకు అవగాహన కల్పించారు. శుక్రవారం తన నివాసంలో ఓటు నమోదుపై ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

● ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయమే లక్ష్యంగా ఓటర్ల నమోదు, ప్రచారం నిర్వహిస్తున్నామని తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికల్యాణి అన్నారు. కాకులపాడు, దంటగుంట్ల, బాపుల పాడు గ్రామాల్లో గురువారం ఇంటింటికీ వెళ్లి ఓటరు నమోదుపై పట్టభద్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వెంకట్, తెలుగు మహిళలు పాల్గొన్నారు.



స్టడీమెటీరియల్ ఆవిష్కరిస్తున్న గుడివాడ, ఉయ్యూరు ఉప విద్యాశాఖ అధికారి పద్మారాణి

డీఎస్సీ స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ

ఉయ్యూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ పరీక్ష రాసే అభ్యర్థులకు పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు రూపొందించిన విద్యా మనో విజ్ఞాన శాస్త్రం స్టడీ మెటీరియల్ గుడివాడ, ఉయ్యూరు ఉప విద్యాశాఖ అధికారి పద్మారాణి గురువారం ఆవిష్కరించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈవో విశ్వమోహన్, యూటీఎఫ్ నాయకులు పీవీ రమణ, కార్యదర్శి సుమంత్, సహాధ్యక్షుడు రవికాంత్, జిల్లా కౌన్సిలర్ మాధవీలత, రాజు, హెచ్ఎం జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు. ఉచిత మెటీరియల్ కావాల్సిన వారు 9492747453, 7330034003 నంబర్లలో సంప్రదించాల్సిందిగా యూటీఎఫ్ నాయకులు పీవీ రమణ తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ పెనమలూరు నియోజకవర్గ
సమన్వయకర్తగా ధనేకుల మురళి

పెనమలూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్తగా ధనేకుల మురళీమోహన్‌రావును పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నియమించినట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. గురువారం కానూరులో జరిగిన కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకుల సమావేశంలో కృష్ణాజిల్లా కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి, మార్నీడి బాబ్జీ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గొల్లు కృష్ణ మాట్లాడుతూ, కాంగ్రెసు పార్టీ సమన్వయ కర్తగా ఎంపికైన ధనేకులకు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి మొవ్వ మోహన్‌రావు, వెలిసెల సుబ్రహ్మణ్యం, కిలారు వెంకటరత్నం, మహ్మద్ ముస్తాక్, తోటకూర రాధమాధవి, బాలాజీ నాయక్, రాజశేఖర్ వర్మ, ఆరికట్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.



జంక్షన్ ఎస్సై-1 సురేశ్‌ను సత్కరిస్తున్న జనసేన జంక్షన్ పట్టణ అధ్యక్షుడు అహమ్మద్, తదితరులు

విధి నిర్వహణకు సహకరించాలి

హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 24: (ఆంధ్రజ్యోతి) : శాంతి భద్రతలను కాపాడేందుకు నిరంతరం పనిచేస్తున్న పోలీస్ సిబ్బందికి ప్రజలు సహకరించాలని జంక్షన్ ఎస్సైలు వి. సురేష్, నరసింహమూర్తి కోరారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఇరువురు ఎస్సైలను గురువారం జనసేన జంక్షన్ పట్టణ కమిటీ అధ్యక్షుడు అహమ్మద్ ఆధ్వర్యంలో స్వాగతం పలుకుతూ శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో వీర మహిళ జయరాణి, పలువురు జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

28 నుంచి మొబైల్ రిపేరింగ్‌లో శిక్షణ

ఉంగుటూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్ (విజయవాడ చాప్టర్) ప్రాంగణంలోని యూనియన్‌బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి ఉచిత శిక్షణా కేంద్రం (యూబీఆర్ఎస్ఈటీఐ)లో ఈ నెల 28నుంచి మొబైల్ రిపేరింగ్‌లో ఉచిత శిక్షణా తరగతులు ప్రారంభిస్తున్నట్లు శిక్షణా కేంద్రం డైరెక్టర్ పి.మల్లికార్జునరెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగయువతకు స్వయం ఉపాధిని కల్పించడమే లక్ష్యంగా యూనియన్ బ్యాంక్ రూరల్‌సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ద్వారా పలు రకాల వృత్తినైపుణ్య కోర్సుల్లో ఉచిత శిక్షణ అందిస్తోందన్నారు. ఇందులో భాగంగా యువకుల కోసం నెలరోజులు కాలవ్యవధితో కూడిన మొబైల్ రిపేర్ అండ్ సర్వీసెస్ కోర్సును అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఆసక్తిగల ఉభయ కృష్ణాజిల్లాల్లోని యువకులు నాలుగు పాస్‌పోర్ట్‌సైజ్ ఫోటోలు, రేషన్, ఆధార్‌కార్డ్, విద్యార్హత ధ్రువీకరణపత్రాల నకళ్లతో నేరుగా శిక్షణా కేంద్రానికి విచ్చేసి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 6304254730, 9490011081 నెంబర్లలో సంప్రదించాలని డైరెక్టర్ సూచించారు.

ప్రయాణం.. నరకం!

- తరచూ ప్రమాదాలతో నెత్తురోడుతున్న కరకట్ట
- మరమ్మతులు చేపట్టటంలో ప్రభుత్వం విఫలం
- బెంబేలెత్తుతున్న ప్రయాణికులు

(పెనమలూరు - ఆంధ్రజ్యోతి)

విజయవాడ నుంచి అవనిగడ్డ వైపు వెళ్లే కృష్ణానది కరకట్ట కొన్ని సంవత్సరాలుగా మరమ్మతులకు నోచుకోకపోవడంతో కరకట్ట రోడ్డుపై ప్రయాణం నరకంగా మారింది. కనీస మరమ్మతులు చేయాల్సిన అధికారులు, పాలకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంతో కరకట్ట రోడ్డు నెర్రెలు బారి వాహనదారులకు చుక్కలు చూపిస్తోంది. కరకట్ట రోడ్డుపై వాహనదారులు ప్రమాదాలకు లోనై గాయాలపాలవడం పరిపాటిగా మారింది. యనమలకుదురు నుంచి అవనిగడ్డ వరకు ఉన్న కరకట్టపై ప్రతి రోజూ సరాసరి రెండు నుంచి మూడుకు తక్కువ కాకుండా ప్రమాదాలు చోటు చేసుకొని ప్రయాణికులు తీవ్ర గాయాలపాలవుతున్నారంటే తీవ్రత అర్థం చేసుకోవచ్చు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కరకట్టకు కనీస మరమ్మతులు చేసి కరకట్టపై ప్రయాణం సజావుగా సాగేట్లు చేస్తారని ప్రయాణికులు కోరుతున్నారు.


కృష్ణా కరకట్టపై అధ్వానంగా రహదారి

వైసీపీ, టీడీపీ కౌన్సిలర్ల వాగ్వాదం

- టిడ్కో ఇళ్ల లబ్ధిదారులపై బ్యాంకు అధికారుల వేధింపులపై కౌన్సిలర్ల మధ్య తీవ్ర వాగ్వాదం
- టీడీపీ కౌన్సిలర్లపైకి దూసుకెళ్లిన వైసీపీ కౌన్సిలర్లు
- చైర్మన్ నచ్చజెప్పడంతో శాంతించిన ఇరు వర్గాలు


ఉయ్యూరు కౌన్సిల్ సమావేశంలో వైసీపీ, టీడీపీ నాయకుల వాగ్వాదం

ఉయ్యూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : టిడ్కో ఇళ్ల లబ్ధిదారులపై బ్యాంకు అధికారుల ఒత్తిడి, వేధింపులకు కారణం మీప్రభుత్వమే అంటే కాదు మీరే అని వైసీపీ, టీడీపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం తీవ్రస్థాయికి చేరుకుని ఒకరిపైకి ఒకరు దూసుకువెళ్లే వరకు దారితీసింది. ఉయ్యూరు నగర పంచాయతీ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ అధ్యక్షతన గురువారం జరిగిన నగర పంచాయతీ కౌన్సిల్ అత్యవసర సమావేశం చివరిలో వైసీపీ, టీడీపీ కౌన్సిలర్ల మధ్య తీవ్రస్థాయిలో మాటల యుద్ధం ఉద్రిక్తత పరిస్థితులు చోటు చేసుకుని చైర్మన్ సర్ది చెప్పడంతో ముగిసింది. అజెండాలోని అంశాలు ఆమోదం తరువాత వైసీపీ కో-ఆప్షన్ సభ్యుడు ఖలీల్ లేచి టిడ్కో ఇళ్ల లబ్ధిదారులను లోన్‌లు కట్టమని బ్యాంకుల వారు ఫోన్‌ల ద్వారా, నివాసాలవద్దకు వచ్చి వేధిస్తూ, ఒత్తిడి చేస్తున్నారని, ఇళ్లు అప్పగించకుండా లోన్ ఎలా కట్టేదని లబ్ధిదారులు మొరపెట్టుకుంటున్నారని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. లబ్ధిదారులకు లోన్ ఇప్పించి ప్రభుత్వ ఖాతాకు జమ చేసుకుని ఇళ్ల నిర్మాణం పూర్తిచేయకుండా మోసం చేసింది వైసీపీ ప్రభుత్వమే కదా అని టీడీపీ కౌన్సిలర్లు పలియాల శ్రీనివాసరావు, పండ్రాజు సుధారాణి, బూరెల రమణ, పరిమి సలోమి సంతోషి ఖలీల్‌ను నిలదీశారు. దీంతో వైసీపీకి చెందిన వైస్ చైర్మన్ సోలె సురేశ్ లేచి టీడీపీ కౌన్సిలర్లను చాల్లే కూర్చోండి అంటూ దురుసుగా మాట్లాడంతో ఇరు వర్గాల మధ్య మాటల యుద్ధం చోటు చేసుకుంది. ఇరువురు వారిస్థానాల నుంచి లేచి ఒకరిపైకి ఒకరు దూసుకు వెళ్లారు. మరో వైస్ చైర్మన్ అర్షదున్నీసా, ఖలీల్ సోలే సురేశ్‌కు వత్తాసు పలకగా టీడీపీ కౌన్సిలర్లు మూకుమ్మడిగా అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ దశలో చైర్మన్ కలుగచేసుకుని ఈ సమస్య ఉయ్యూరులోనే కాదు, రాష్ట్ర వ్యాప్తంగా ఇలానే ఉంది. లోన్ కట్టేందుకు మరికొంత సమయం ఇవ్వాలని, వడ్డీ కూడా ప్రభుత్వమే చెల్లిస్తుందని మంత్రులు, జిల్లా కలెక్టర్లు బ్యాంకుల వారితో మాట్లాడుతున్నారని ఇరువురికి సర్దిచెప్పి వివాదం ముగింపజేశారు. కమిషనర్ పి. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


ఆక్యుపంక్చర్‌డే ఉత్సవాల బ్రోచర్‌ను విడుదల చేస్తున్న వైద్యులు

ఏస్పా భారత్ ఆధ్వర్యంలో
నేషనల్ ఆక్యుపంక్చర్ డే ఉత్సవాలు

పెనమలూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఏస్పా భారత్ ఆధ్వర్యంలో కానూరు ఏస్పా కార్యాలయంలో నేషనల్ ఆక్యుపంక్చర్‌డే ఉత్సవాలను ఘనంగా నిర్వహించినట్లు ఏస్పా వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ మాకాల సత్యనారాయణ తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధుల సమక్షంలో వచ్చే నెల 16వరకు ప్రపంచ ఆక్యుపంక్చర్ అవగాహన చికిత్స శిబిరాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు డాక్టర్ మాకాల తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవాల బ్రోచర్‌ను విడుదల చేశారు. ఆక్యుపంక్చర్ వైద్యానికి కేంద్ర ప్రభుత్వం గుర్తింపు ఇవ్వడం పట్ల ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ఆక్యుపంక్చర్ ప్రాక్టీషనర్స్ కన్వీనరుగా డాక్టర్ కాశీమహంతి సునీత, తెలంగాణ కన్వీనరుగా కుమారస్వామి, ఒరిస్సాకు శ్యామల, యానాంకు స్వామి, వెస్ట్ బెంగాల్‌కు తవసిఫ్, ఏస్పా భారత్ అధ్యక్షుడిగా అలవాల రవి, ఉపాధ్యక్షుడిగా జ్యోతి రాజు తదితరుల ఎంపికైనట్లు తెలిపారు.

సేవా కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్ ముందంజ

క్లబ్ జిల్లా గవర్నర్ గద్దె శేషగిరి

ఉయ్యూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : సేవాకార్యక్రమాల్లో లయన్స్ క్లబ్ ముందంజలో ఉంటుందని క్లబ్ జిల్లా గవర్నర్ గద్దె శేషగిరి అన్నారు. గవర్నర్ పర్యటనలో భాగంగా గురువారం ఉయ్యూరు క్లబ్‌ను సందర్శించి క్లబ్ జోన్ చైర్‌పర్సన్ ఇస్మాయిల్, క్లబ్ జిల్లా క్యాబినెట్ డిప్యూటీ సెక్రటరి నూకల సాంబశివరావు, స్థానిక క్లబ్ అధ్యక్షుడు నేరెళ్ల తేజతో కలసి పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. క్లబ్ నిర్దేశిత ఫైవ్‌స్టార్ సేవా కార్యక్రమాల్లో భాగంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ రాంబాబు, ట్రెజరర్ దినవహిప్రసాద్, ప్రతినిధులు నల్లాశ్రీనివాసరావు, వూర కిషోర్, హసన్ అహ్మద్, పోగిరి రాము, మాజీ గవర్నర్ పి.సుభాశ్, జిల్లా క్యాబినెట్ ప్రతినిధులు ఎన్‌వి రామకృష్ణ, చెన్నారెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.


కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

రీసర్వేలో భూ వివరాలను సరిచేయాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : రీసర్వే ద్వారా భూ వివరాల నమోదులో విస్తీర్ణం తగ్గిపోవడం, పేరు మార్పులు లాంటి తప్పుల వల్ల అన్ని విధాలుగా నష్టపోతున్నామని రైతులు తహసీల్దార్ నాగభూషణంకు వినతిపత్రం అందజేశారు. రంగన్నగూడెం సర్పంచ్ కసుకుర్తి రంగామణి అధ్యక్షతన గురువారం నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు ఆళ్ల గోపాలకృష్ణ మొవ్వా వేణుగోపాల్, కనకవల్లి శేషగిరిరావు, కొలుసు గంగాజలం, ఆళ్ల పాండు రంగారావు, సత్యప్రసాద్, తదితర రైతులు పాల్గొన్నారు.


భూముల రీ సర్వేలో తప్పులను సరిచేయాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ రంగామణి, ఆళ్ల గోపాలకృష్ణ

పొణుకుమాడులో

ఉంగుటూరు : గ్రామాల్లో రైతుల భూములకు సంబంధించి ఎటువంటి సమస్యలు లేకుండా సానుకూల వాతావరణంలో సామరస్యంగా పరిష్కరించాలనే సదుద్దేశ్యంతో ప్రభుత్వం రీసర్వే గ్రామసభలను పకడ్బందీగా నిర్వహిస్తోందని ఆర్ఐ సూర్యకాంతి అన్నారు. మండలంలోని పొణుకుమాడులో సర్పంచ్ అన్నే సుబ్బలక్ష్మి అధ్యక్షతన గురువారం జరిగిన రీసర్వే గ్రామసభలో ఆమె పాల్గొని రైతులనుంచి అర్జీలు స్వీకరించారు.

సారూ.. రోడ్డుపై గుంతలు పూడ్చరూ..



(పెనమలూరు - ఆంధ్రజ్యోతి)

కొన్ని సంవత్సరాలుగా గుంతల రోడ్డుతో నరకయాతన పడుతున్నామని, గుంతలను పూడ్చడానికి తామే తాడిగడప మునిసిపాలిటికి రూ.50 వేలు ఇస్తామని, కానూరు 80 అడుగుల రోడ్డు అప్రోచ్‌రోడ్డు యడ్లపల్లి సత్యం వీధి వాసులు అధికారులకు చెబుతున్నారు. తాము పడుతున్న ఇబ్బందులపై స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు కొంతకాలం క్రితం వినతి పత్రం ఇచ్చామని, ఆయన సానుకూలంగా స్పందించారని, కాని ఇంత వరకు పనులు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు.


ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు స్వాగతం పలుకుతున్న ఎన్నారైలు

డల్లాస్‌లో ఎమ్మెల్యే యార్లగడ్డకు ఘనస్వాగతం

గన్నవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు డల్లాస్‌లో ఘనస్వాగతం లభించింది. రెండు వారాల పర్యటన నిమిత్తం అమెరికా వెళ్లిన ఎమ్మెల్యే యార్లగడ్డకు అక్కడ ఎన్నారై టీడీపీ నాయకులు డల్లాస్ ఫోర్ట్ వర్త్ అంతర్జాతీయ విమానాశ్రయంలో పూలబొకేలు అందజేసి స్వాగతం పలికారు. 17నెలల సుదీర్ఘ విరామం అనంతరం ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించి తొలిసారి అమెరికా చేరుకున్న యార్లగడ్డకు ఎన్నారై టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తానా ప్రతినిధులు ఆయన అభిమానులు, ఎన్నారై తెలుగు యువత నాయకులు అధిక సంఖ్యలో విమానాశ్రయా నికి వచ్చారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ ధన్యావాదాలు తెలిపిన ఆయన వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల్లో తన విజయం కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రత్యేక పూజలు

హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బిటీఐ రోడ్డులోని షిరిడీ సాయి బాబా మందిరంలో గురువారం బాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. బాబాకు పంచామృతాభిషేకం ,అర్చనలు జరిపారు. ఈ సందర్భంగా బాపులపాడు గ్రామానికి చెందిన భక్తుడు సిరిపురపు సుబాష్ చంద్రబోస్ దంపతులు 500 మందికి అన్నసం తర్పణ చేశారు. అనంతరం బాబాకు నగర సంకీర్తన నిర్వహించారు.



ఆహారం పంపిణీ చేస్తున్న సేవాసమితి వలంటీర్లు

అన్నార్తుల అన్నపూర్ణ

పదేళ్లుగా 'పేట'లో అన్నపూర్ణ సేవా సమితి సేవలు

వివాహ వేడుకలు, పుట్టినరోజు, పెళ్లిరోజు ఏదైతైనేమి..ఇటీవల కాలంలో ఇళ్లల్లో, ఫంక్షన్ హాళ్లలో నిర్వహించే వేడుకల్లో ఫలహారాలు, విందుభోజనాలు, పాన్‌లకు రూ.లక్షల్లో ఖర్చు పెడుతున్నారు. కీర్తి, పేరు కోసం ఒకరు 30 రకాలతో విందు భోజనాలు పెడితే పోటీగా మరొకరు 40 రకాలు పెడుతున్నారు. వేడుకలకు వచ్చిన వారు తిన్నంత తినేసి, మిగిలిన ఆహారాన్ని డస్ట్‌బిన్లలో పడేస్తున్నారు. వేడుకల్లో పెట్టే ఆహారం వృథా కాకుండా.. అర్ధాకలితో అలమటించే వారికి ఒక్క రోజైనా కడుపునిండా ఆహారం పెట్టాలనే సంకల్పం నుంచి పుట్టిందే అన్నపూర్ణ సేవా సమితి. తన మిత్రుల ఫంక్షన్లలో మిగిలిపోయిన ఆహారాన్ని పారేయడాన్ని చూసిన జగ్గయ్యపేట ఆర్యవైశ్య యువజన సంఘం ఉపాధ్యక్షుడు మహంకాళి జయప్రకాశ్ అన్నపూర్ణ సేవా సమితిని ప్రారంభించారు. వేడుకల్లో మిగిలిన ఆహారాన్ని 2014 ఏప్రిల్ 2 నుంచి పేదలకు పంచడం ప్రారంభించారు. అర్ధాకలితో అలమటించే వారి పాలిట సమితిని అన్నపూర్ణగా మార్చారు.

- వేడుకల్లో ఆహార వృథాకు అడ్డుకట్ట
- మిగిలిపోయిన ఆహారం సేకరణ
- పేదవాడలకు పంపిణీ.. ఏటా లక్ష మందికిపైగా అందజేత

(ఆంధ్రజ్యోతి- జగ్గయ్యపేట)

వేడుకల్లో మిగిలిన ఆహారాన్ని అన్నపూర్ణ సేవా సమితి సేకరించి, పంచుతున్నా మొదట్లో తీసుకునేందుకు పేదలు ముందుకొచ్చేవారు కాదు. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మహంకాళి జయప్రకాశ్ చొరవతో తొలుత పిల్లలు, తర్వాత పెద్దలు తీసుకోవడం ప్రారంభించారు. ఫంక్షన్ల నిర్వాహకులు కూడా పేదలకు ఒక పూట ఆహారం పెట్టినట్టు అవుతుందని జయప్రకాశ్‌ను పిలిచి మిగిలిన ఆహారాన్ని ఇవ్వడానికి ముందుకొచ్చారు. ప్రారంభించిన తొలినాళ్లలో ఏడాదికి 50 నుంచి 60 రోజులు ఆహార పంపిణీ చేస్తే, పదేళ్ల గడిచేటప్పటికి ఏడాదికి 300 రోజులకు పైగా పంపిణీ చేస్తున్నారు. జయప్రకాశ్ ఆలోచన నచ్చిన స్నేహితులు, తోటి వ్యాపారులు ఆహార పంపిణీలో భాగస్వాములవడంతో కార్యక్రమం విజయవంతంగా సాగుతోంది.

ఏటా రూ.కోటి విలువైన ఆహారం సద్వినియోగం

పట్టణంలోని మిట్టగూడెం యానాదుల కాలనీలో ప్రారంభమైన కార్యక్రమం, పేదలవాడలన్నింటికీ విస్తరించింది. ఏటా లక్ష మందికిపైగా ఆహారం అందిస్తోంది. రూ.కోటికి పైగా ఆహారాన్ని వృథా కాకుండా పేదల కడుపు నింపుతోంది. పదేళ్లలో రూ.10కోట్ల విలువైన ఆహారం సద్వినియోగమైంది.

ఫోన్ చేసి..సమాచారమిస్తే చాలు

జగ్గయ్యపేటతో పాటు, గ్రామీణ ప్రాంతాలు, మండల కేంద్రాల్లో ఆహారం మిగిలితే సేవాసమితికి ఫోన్‌చేసి సమాచారమిస్తున్నారు. తెలంగాణ ప్రాంతానికి జగ్గయ్యపేట సరిహద్దుగా ఉండటంతో కోదాడ, హుజూర్‌నగర్, నందిగామ ప్రాంతాలకు కూడా సేవలు విస్తరించాయి. రెండేళ్ల క్రితం నందిగామలో అక్కడి వ్యాపారులు, యువకులు కొందరు జయప్రకాశ్ ఆధ్వర్యంలో అన్నపూర్ణ సేవా సమితిని ప్రారంభించారు.

200 మంది వలంటీర్ల నిస్వార్థ సేవలు

ఆహారం ఉందని ఫోన్ రాగానే సేవాసమితి ప్రతినిధులు ఆహార పరిమాణం మేరకు సొంతంగా సమకూర్చుకున్న సామగ్రితో బైక్‌లపై వెళతారు. పెద్ద మొత్తమైతే ఆటోలు ఇతర వాహనాలు తీసుకెళతారు. ఫంక్షన్ హాలు నుంచి ఆహారం సకాలంలో అందింతే నేరుగా వాడలకు వెళ్లి పంచేస్తారు. అర్ధరాత్రి అయితే వాటిని జయప్రకాశ్ ఇంటికి తీసుకెళ్లి జాగ్రత్త చేస్తారు. వేడిగా ఉన్న ఆహారమైతే ఇంట్లో నేలపై వస్త్రం వేసి ఆరబెడతారు. అవి పాడైపోకుండా చూస్తారు. ప్రకాశ్‌తో పాటు ఆయన భార్య, పిల్లలు సహకరించి కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు. ఆహార పంపిణీకి సేవా సమితి వలంటీర్లు 200 మంది ఉన్నారు. వారంతా సొంతవృత్తులను, వ్యాపారాలను చూసుకుంటూనే ఈ సేవలు అందిస్తారు. వారిలో 30 నుంచి 50 మంది నిత్యం ఆహార పంపిణీకి సిద్ధంగా ఉంటారు.

పదేళ్లుగా నిరాటంకంగా..

ఆహార వృథాను అరికట్టేందుకు జయప్రకాశ్ క్లీన్‌ప్లేట్ కంటెస్ట్‌ను నిర్వహించారు. తన కుమార్తె కార్యక్రమంలో ఆహారం వృథా చేయకుండా విందు ఆరగించినవారికి బహుమతులు అందించారు. కరోనా సమయంలో వివాహాది శుభకార్యాలు నిలిచిపోవడంతో మిత్రుల సహకారంతో పేదలకు బియ్యం పంపిణీ చేశారు. మిట్టగూడెంలో పేదవిద్యార్థుల కోసం కొంత కాలం పాఠశాలను నడిపారు. వృథా ఆహారంతో పాటు పాతవస్త్రాలను సేకరించి పేదవాడల పిల్లలకు పంపిణీ చేస్తున్నారు. ఇటీవల వరదల సమయంలో సామాజిక బాధ్యతగా ఆహారం వండించి పంపిణీ చేశారు. పాత వస్త్రాలను సేకరించి అందించారు. పట్టణానికి వచ్చే మతిస్థిమితం లేని వ్యక్తులకు ఆహార పొట్లాలను అందించారు. ఫంక్షన్ల నిర్వాహకుల నుంచి రూపాయి తీసుకోకుండా సొంతంగానే ఆటోలు, రవాణా వాహనాలు, ఆహారం సరఫరాకు ఉపయోగించే పాత్రలు జయప్రకాష్ కొనుగోలు చేశారు. పదేళ్లుగా నిరాటంకంగా సేవలు అందిస్తూనే ఉన్నారు. పదేళ్లుగా తనతోపాటు నిస్వార్థ సేవలు అందించిన సేవాసమితి వలంటీర్లను ఆదివారం సేవాసమితి వ్యవస్థాపకుడు జయప్రకాశ్ ఆధ్వర్యంలో సత్కరించారు.

ఆహార వృథాను తగ్గించాలన్నదే లక్ష్యం



ఆహార వృథాను అరికట్టాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాం. పదేళ్ల క్రితం ఆంధ్రజ్యోతి ఆదివారం పుస్తకంలో వచ్చిన ఒక వ్యాసం నన్ను ఆలోచింపజేసింది. సేవాసమితి ద్వారా వృథా అవుతున్న ఆహారాన్ని పేదలకు అందించి వారి ఆకలి తీరుస్తున్న తృప్తే- పదేళ్లుగా ఈ మహాయజ్ఞాన్ని నడిపిస్తోంది.

- మహంకాళి జయప్రకాష్, అన్నపూర్ణ సేవాసమితి వ్యవస్థాపకుడు

ప్రముఖుల ప్రశంసలు

ఆహార వృథాను అరికట్టడంతో పాటు, పేదల ఆకలి తీరుస్తున్న అన్నపూర్ణ సేవా సమితి గురించి తెలుసుకున్న మాజీ రాష్ట్రపతి వెంకయ్యనాయుడు తనవద్దకు పిలిపించుకుని సభ్యులను అభినందించారు. ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య టీడీపీ విజయవాడ పార్లమెంట్ అధ్యక్షుడు నెట్టెం రఘురాం, గురుధామ్ వ్యవస్థాపకుడు, తాత్వికుడు గెంటేల వెంకటరమణ, గాయత్రీ ఆశ్రమ వ్యవస్థాపకుడు, తాత్వికుడు చిట్టా లక్ష్మీనర సింహశాస్త్రి తదితరులు సేవాసమితి సేవలను ప్రశంసించారు.



మహంకాళి జయప్రకాష్, వలంటీర్లను అభినందిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు(ఫైల్)

కందిపప్పు, పంచదార ఫుల్

- ఐదేళ్ల తర్వాత రేషన్ డిపోలకు..
- బహిరంగ మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.180 పైనే
- రేషన్ దుకాణంలో కిలో రూ.67
- కార్డుదారులందరికీ నవంబరులో సరఫరా
- సీఎంకు డీలర్ల ధన్యవాదాలు

(ఆంధ్రజ్యోతి-మొగల్రాజపురం)

ఐదేళ్ల తర్వాత రేషన్‌డిపోలకు ఫుల్లుగా కందిపప్పు, పంచదార వచ్చింది. 2014లో టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రన్న క్రిస్మస్, సంక్రాంతి, రంజాన్ కానుకలు ఇస్తూ కార్డుదారులకు ప్రతినెలా కందిపప్పు, పంచదార, గోధుమపిండి, రాగులు, జొన్నలు అందించేవారు. 2019లో వైసీపీ ప్రభుత్వమొచ్చాక డోర్ డెలివరీ పేరుతో ఎండీయూ వాహనాలు తీసుకొచ్చింది. సరుకుల్లో కోతపెట్టి కార్డుదారులకు బియ్యంతో సరిపుచ్చింది. అడపాదడపా ఒక్కో షాపునకు క్వింటా, అరక్వింటా కందిపప్పు, సగం పంచదార ఇచ్చేవారు. టీడీపీ హయాంలో కందిపప్పు కిలో రూ.40, పంచదార అరకిలో రూ.6.50 ఉండేవి. వైసీపీ ప్రభుత్వం రాగానే కందిపప్పు కిలో రూ.67, పంచదార అరకిలో ప్యాకెట్ రూ.17కు పెంచింది. ధర పెంచినా సరుకులు పూర్తిగా ఇచ్చేవారు కాదు. కార్డుదారులకు సరుకులు లేక డీలర్లకు కమీషన్ రాక ఇబ్బందులు పడేవారు. కూటమి ప్రభుత్వమొచ్చాక సీఎం చంద్రబాబు, మంత్రి నాదెండ్ల మనోహర్ సమీక్ష నిర్వహించారు. బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు రూ.కిలో 180కి పైగా పలుకుతుండడంతో రాష్ట్రంలోని కార్డుదారులందరికీ కందిపప్పు అందించాలనే లక్ష్యంతో రెండు నెలల క్రితం టెండర్లు పిలిచారు. గత నెల సరఫరాదారుల నుంచి సరుకు రావడం మొదలైంది. ఈనెల 20వ తేదీకే అన్ని ఎంఎల్ఎస్ పాయింట్లకు సరుకులు పూర్తిగా తరలించి సిద్ధంగా ఉంచారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో 11,31,103 కార్డులు ఉన్నాయి. ఎన్టీయార్ జిల్లాలో 5,97,815 కార్డులు, కృష్ణాజిల్లాలో 5,33,288 కార్డులు ఉన్నాయి. నవంబరులలో కార్డుదారులందరికీ కందిపప్పు, పంచదార ఇవ్వబోతున్నారు. బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు రూ.180 ఉండడంతో సామాన్యుడు ఇబ్బంది పడకుండా రైతు బజార్లలో ఇప్పటికే కందిపప్పు కౌంటర్లు తెరచి కిలో రూ.110కే అందిస్తున్నారు.

ఐదేళ్ల తర్వాత డీలర్ల ఆనందం

కరోనా కాలం నుంచి మోదీ ప్రభుత్వం ఉచితంగా ఇచ్చిన కమీషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం డీలర్ల గోడౌన్ ఖాతాలో వేసింది. ఈ కమీషన్‌తో కందిపప్పు, పంచదార విడిపించుకునే అవకాశం లేక కమీషన్ పూర్తిస్థాయిలో చేతికి రాక డీలర్లు గతంతో తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారు. తాజాగా సీఎం చంద్రబాబు నిర్ణయంతో డీలర్లు గోడౌన్ ఖాతాలో ఉన్న కమీషన్‌తో ఈనెల కందిపప్పు, పంచదార విడిపించుకుంటున్నారు. ఐదేళ్ల తర్వాత దుకాణాలకు పూర్తిస్థాయిలో సరుకులు వచ్చాయని కందిపప్పు, పంచదార కమీషన్ రూపంలో కాస్తంత ఆదాయం పెరుగుతుందని ఆనందం వ్యక్తంచేస్తున్నారు. సీఎంకు ధన్యవాదాలు చెబుతున్నారు.

మర్యాదపూర్వకంగా..

విజయవాడ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఏఆర్ అనురాధకు ఎన్టీఆర్ పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు అభినందనలు తెలిపారు. ఎంజీ రోడ్డులోని పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనురాధకు పుష్పగుచ్ఛం అందించారు.



ఏపీపీఎస్సీ ఛైర్‌పర్సన్ అనురాధకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సీపీ రాజశేఖరబాబు

విద్యాశాఖ ఎన్టీఆర్ జిల్లా ఏడీ కుమార్ బదిలీ

విజయవాడ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ ఎన్టీఆర్ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ కేవీఎన్ కుమార్ బదిలీ అయ్యారు. ఆయనను అన్నమయ్య జిల్లా మదనపల్లె ఉప విద్యాశాఖాధికారిగా నియమించారు. రాష్ట్రంలో 21 మంది విద్యాశాఖాధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

27న స్విమ్మింగ్ ఎస్జీఎఫ్ ఎంపికలు

విజయవాడస్పోర్ట్సు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి కృష్ణాజిల్లా అండర్ -19 స్విమ్మింగ్ బాల, బాలికల జట్ల ఎంపికలను ఈనెల 27న ఉదయం 9 గంటలకు బ్లూమింగ్ డేల్ ఇంటర్నేషనల్ స్కూల్లో నిర్వహిస్తున్నట్లు ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి వి.రవికాంత ఒక ప్రకటనలో తెలిపారు. నవంబరు 1న ఉదయం 9 గంటలకు విజయవాడ మేరీ స్టెల్లా కళాశాలలో బాస్కెట్‌బాల్, అదేరోజు మధ్యాహ్నం 2గంటలకు మొగల్రాజపురం పీబీ సిద్ధార్థలో ఖోఖో, వాలీబాల్ జట్ల ఎంపికలు, 2న ఉదయం 9 గంటలకు మేరీ స్టెల్లా కళాశాలలో నెట్‌బాల్ బాల,బాలికల జట్ల ఎంపికలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లు, క్రీడాకారులు అర్హతా పత్రాలతో హాజరు కావాలని రవికాంత సూచించారు.

ఐటీఐలో ఐదో విడత అడ్మిషన్లకు దరఖాస్తులు

భారతీనగర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో 2024-25 విద్యా సంవత్సరానికి, ఐటీఐ కోర్సుల్లో ఐదో విడత అడ్మిషన్లకు, ఎన్టీఆర్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో మిగిలిన సీట్ల భర్తీకి ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా శనివారంలోపు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ ప్రధానాధికారి, కన్వీనర్ ఎం.కనకారావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 28న, ప్రైవేట్ ఐటీఐలో ఈనెల 30న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. వివరాలకు 94906 39639, 77804 29468లకు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.

దేవాలయాల సందర్శనకు ప్రత్యేక రైలు

ధర్నాచౌక్, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని దేవాలయాల సందర్శనకు ఇండియన్ రైల్వేస్-భారత్ గౌరవ్ రైలు పథకం కింద సౌత్‌స్టార్ రైల్, టూర్ టైమ్స్ ప్రత్యేక రైలును ప్రకటించిందని టూర్ టైమ్స్ ప్రొడక్ట్ మేనేజర్ విఘ్నేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 5న ప్రారంభమయ్యే ఈ ప్రత్యేక రైలుయాత్రలో కర్ణాటకలోని ప్రముఖ దేవాలయాలను సందర్శించవచ్చని తెలిపారు. తొమ్మిది రోజుల పర్యటనలో వనబృందావనం, గోకర్ణ, మురుడేశ్వర్, కొల్లూరు, శృంగేరి, హొరనాడు, ధర్మస్థల, కుకి సుబ్రమణ్య, మైసూర్, శ్రీరంగపట్నం, మేల్కోటేలర్‌ను సందర్శించవచ్చని పేర్కొన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రయాణికులు గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, గుంటూరు, నల్గొండ, మిర్యాల గూడ, సికింద్రాబాద్‌లలో ఈ రైలును ఎక్కవచ్చని తెలిపారు. థర్డ్‌ఏసీ రూ.33,000, థర్డ్‌ఏసీ ప్రీమియం రూ.37,000, సెకండ్ ఏసీ రూ.40,000గా ప్యాకేజీ నిర్ణయించారని తెలిపారు. మరిన్ని వివరాలకు 93550 21516 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని ఆయన సూచించారు.

బాణాసంచా దుకాణాలకు దరఖాస్తులు

వన్‌టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా నగరంలో బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేసేందుకు లైసెన్స్ కలిగిన వ్యాపారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29వ తేదీ నుంచి 31వ తేదీ వరకు మూడు రోజులు విద్యాధరపురం లేబర్ కాలనీలో స్టేడియం కొరకు కేటాయించిన స్థలం, సింగ్‌నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో బాణసంచా విక్రయ స్టాల్స్ ఏర్పాటు చేసుకొనుటకు విక్రయదారులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. బాణసంచా విక్రయ స్టాల్స్ ఏర్పాటు చేసుకొనుటకు ఈనెల 24వ తేదీ నుంచి 28వ తేదీ వరకు మధ్యాహ్నం 2 గంటల వరకు కార్యాలయం పనివేళల్లో దరఖాస్తులు పొంది, దాఖలు చేసుకోవాలని ఆయన సూచించారు. అక్టోబరు 28న మధ్యాహ్నం 3 గంటలకు దరఖాస్తుదారుల సమక్షంలో లాటరీ పద్ధతిలో స్టాల్స్ కేటాయిస్తామని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు.

రైతుల ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు అమరావతిలో 9 కేంద్రాలు

వన్‌టౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాజధాని ప్రాంత అభివృద్ధికి భూములు ఇచ్చి ప్లాట్లు పొందిన రైతుల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం అమరావతిలో 9 రిజిస్ట్రేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసిందని ఏపీసీఆర్డీయే అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్ తెలిపారు. భూములు ఇచ్చిన రైతులకు సీఆర్డీయే కార్యాలయంలో ఈ-లాటరీ కార్యక్రమాన్ని రెండో రోజు గురువారం నిర్వహించారు. ప్రొవిజనల్ సర్టిఫికెట్లు పొందిన రైతులు వారం లోపు రిజిస్ట్రేషన్ కేంద్రాలకు వెళ్లి తమ ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చునని ఆయన తెలిపారు. భూమిపై ప్లాట్లు ఎక్కడ ఉన్నాయో రైతులకు తెలియజేసేందుకు ప్రత్యేకంగా గ్రామ సర్వేయర్లను నియమించినట్లు తెలిపారు. 9 గ్రామాలకు చెందిన 71 మంది రైతులకు 98 నివాస, 72 వాణిజ్య ప్లాట్లను అందజేశారు. కార్యక్రమంలో ఏపీసీఆర్డీయే ల్యాండ్స్ డైరెక్టర్ డీఎల్ఎన్ రాజకుమారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వి.డేవిడ్ రాజు, జి.భీమారావు, కె.స్వర్ణమేరి, జి.సాయి శ్రీనివాసనాయక్, తహసీల్దార్ అరుణాదేవి పాల్గొన్నారు.



రైతుకు ప్లాట్ల కేటాయింపు పత్రం అందజేస్తున్న సీఆర్డీయే అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్



పతకాలు సాధించిన ఏపీ పారా స్విమ్మర్లు

పారా స్విమ్మింగ్ రాష్ట్ర క్రీడాకారులకు పతకాల పంట

విజయవాడ స్పోర్ట్సు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి 24 పారా స్విమ్మింగ్‌లో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులు సత్తా చాటి, 35 పతకాలను సాధించారని ఏపీ పారా స్పోర్ట్సు అసోసియేషన్ అధ్యక్షుడు గోనుగుంట్ల కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. గోవా వేదికగా ఈనెల 22 వరకు ఈ పోటీలు జరిగాయని ఇందులో 16 స్వర్ణాలు, 14 రజతాలు, 5 కాంస్యాలను సాధించారని ఇది చారిత్రక విజయమని కొనియాడారు. పతకాలను సాధించిన స్విమ్మర్లను శాప్ వీసీ, ఎండీ గిరీషా, పారా అసోసియేషన్ సెక్రటరీ వి.రామస్వామి అభినందించారు.

ఫిడే రేటింగ్ చెస్‌లో నీలాష్ సాహా ముందంజ

- మూడోరోజు ఉత్కంఠగా పోటీలు

విజయవాడ స్పోర్ట్సు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని సీతారామపురం ఐకాన్ పబ్లిక్ స్కూల్ వేదికగా సాగుతున్న భారతీయ నవీన్ క్రీడా ఉత్సవ్(బీఎన్‌కేయూ) తొలి ఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్ చెస్ చాంపియన్‌షిప్‌లో పశ్చిమబెంగాల్‌కు చెందిన ఇంటర్నేషనల్ చెస్ మాస్టర్ నీలాష్ సాహా(2467) ఆరు రౌండ్ల పోరులో ఆరు పాయింట్లతో ముందంజలో నిలిచాడు. మూడో రోజు పోటీలను ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఛైర్మన్ పొట్లూరి భాస్కరరావు, కువైట్‌కు చెందిన బ్రిటిష్ కౌన్సిల్ ఇన్విజిలేటర్ దుగ్గిరాల హరితలు, ఏపీ చెస్ అసోసియేషన్ సీఈవో కేవీ జ్వాలాముఖీలు, ఐకాన్ స్కూల్ డైరెక్టర్ కె రాజేంద్రలు ప్రారంభించారు. పోటీలను షేక్ కాశీం, విత్తనాల కుమార్, చీఫ్ ఆర్బిటర్ అమ్మినేని ఉదయ్‌కుమార్ నాయుడు పర్యవేక్షిస్తున్నారు.

ముందంజంలో ఉంది..వీరే

ఆరో రౌండ్ పోరులో ఇంటర్నేషనల్ మాస్టర్ శ్రీహరి(2372) తెల్ల పావులతో, నీలాష్ సాహా(2467) నల్లపావులతో పోటీపడ్డారు. వీరిద్దరి మధ్య మ్యాచ్ నాలుగుగంటల పాటు సుదీర్ఘంగా సాగగా, సాహా జయకేతనం ఎగురవేశాడు. వెంకటేష్ ఎంఆర్, శర్వనన్ కృష్ణన్ (తమిళనాడు), కౌత్సవ్ కుండు(వెస్ట్ బెంగాల్) 5.5 పాయింట్లతో కొనసాగుతున్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ప్రవేష్‌కుమార్

అర్హులందరినీ అటల్ పెన్షన్ యోజనలో చేర్చండి

- బ్యాంకర్లతో పీఎఫ్ఆర్డీఏ చీఫ్ జీఎం ప్రవేష్‌కుమార్

అజిత్‌సింగ్‌నగర్, విజయవాడ రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరూ అటల్ పెన్షన్ పథకంలో చేరేలా బ్యాంకర్లు కృషి చేయాలని పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ(పీఎఫ్ఆర్డీఏ) చీఫ్ జనరల్ మేనేజర్ ప్రవేష్‌కుమార్ అన్నారు. గురువారం పీఎఫ్ఆర్డీఏ-న్యూఢిల్లీ భాగస్వామ్యంతో రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమితి అటల్ పెన్షన్ యోజనపై విజయవాడ రూరల్ అంబాపురం పరిధిలోని కన్వెన్షన్‌లో అవుట్‌రీచ్ కార్యక్రమాన్ని నిర్వహించింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రవేష్‌కుమార్ హాజరయ్యారు. అటల్ పెన్షన్ యోజన అమలులో రాష్ట్రంలోని బ్యాంకులు మెరుగైన పనితీరును కనబరుస్తున్నాయన్నారు. గతేడాది దాదాపు 5.61 లక్షల మందిని పథంక కింద నమోదు చేశారని, ఇదే పనితీరును మునుముందు కూడా కనబరచాలని సూచించారు.

65 ప్లస్ సింగిల్స్ విజేతగా శ్రీనివాసరెడ్డి

- ముగింపు దశకు ఐస్టా టెన్నిస్ టోర్నీ

విజయవాడస్పోర్ట్సు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆకాశమే హద్దుగా చెమటోడ్చి ఆలిండియా సీనియర్ టెన్నిస్ ర్యాంకింగ్ టోర్నీ (ఐస్టా)లో పలు రాష్ట్రాల ప్లేయర్లు ట్రోఫీలను, ప్రైజ్‌మనీలను వశం చేసుకున్నారు. నాలుగురోజులుగా జరుగుతున్న ఐస్టా టోర్నీలో 65 ప్లస్ సింగిల్స్ ఫైనల్స్‌లో శ్రీనివాసరెడ్డి ఫలచంద్రపై 6-2, 6-3 తేడాతో టైటిల్‌ను వశం చేసుకున్నారు. 75 ప్లస్ డబుల్స్‌లో రామకృష్ణ, భాస్కరరావు జోడి శేషసాయి, పీఎస్‌నాయుడు జంటపై 9-4తో గెలిచి డబుల్స్ టైటిల్‌ను వశం చేసుకోగా, 70 ప్లస్ సింగిల్స్‌లో సేతు రాధాకృష్ణమూర్తిపై 6-3, 6-1 తేను, 70 ప్లస్ డబుల్స్‌లో రాంబాబు, సేతు ద్వయం పట్నాయక్, సుందర్ వడివేలుపై 6-0, 6-2తో గెలిచి టైటిళ్లను తమ ఖాతాలో వేసుకున్నారు. విజేతల బహుమతుల ప్రదానోత్సవంలో ఐస్టా డైరెక్టర్ రాధాకృష్ణమూర్తి, కన్వీనర్ మల్లికార్జునరావు ట్రోఫీలు, ప్రైజ్‌మనీలు అందజేశారు. చీఫ్ రిఫరీగా శ్రీకుమార్ వ్యవహరించారు.

సీఎంను కలిసిన డీఆర్ఎం

రైల్వేస్టేషన్: వెలగపూడి సెక్రటేరియట్‌లో సీఎం చంద్రబాబును విజయవాడ డివిజనల్ రైల్వే మేనే జర్ నరేంద్ర ఎ పాటిల్ గురువారం మర్యాద పూర్వ కంగా కలిశారు. ఇద్దరు కొత్తగా కేంద్రం ఆమోదిం చిన అమరావతి రైల్వే లైన్ గురించి చర్చించారు.

ఆలయ ట్రస్టు బోర్డులో స్థానంపై ప్రభుత్వానికి బ్రాహ్మణుల కృతజ్ఞతలు

వన్‌టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆలయాల ట్రస్ట్ బోర్డులొంల బ్రాహ్మణులకు స్థానం కల్పించడంపై బ్రాహ్మణ సామాజికవర్గాల ప్రతినిధి ముష్టి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ఇంత వరకు ట్రస్ట్ బోర్డుల్లో బ్రాహ్మణులకు సభ్యత్వ అవకాశం లేదని, చంద్రబాబుచొరవ తీసుకుని ఈ అవకాశం కల్పించటం అభినందనీయం అన్నారు.

నాయీబ్రాహ్మణులు..

ఆలయాల ట్రస్ట్ బోర్డుల్లో నాయీ బ్రాహ్మణులకు స్థానం కల్పించడంపై ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి అన్నవరపు బ్రహ్మయ్య గురు వారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి కృతజ్ఞతులు తెలిపారు. నాయీ బ్రాహ్మణుల సేవలు వినియోగించుకోవటమే తప్ప వారికి గుర్తింపు ఇచ్చిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. నాయీ బ్రాహ్మణులకు కనీసం నెలకు 20వేల రూపాయలు అందేవిధంగా కూటమి ప్రభుత్వం వచ్చిన 100 రోజుల్లోనే చర్యలు తీసుకోవటం ముదావహం అన్నారు.

ఇసుక అందక కార్మికులు పస్తులు

- బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహారావు

చిట్టినగర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక విధానం అమలు కాక పనుల్లేక బిల్డింగ్ నిర్మాణ కార్మికులు పస్తులు ఉండే దుస్థితి నెలకొందని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి పి. నరసింహారావు అన్నారు. కొత్తపేట పోలీస్‌స్టేషన్ సమీపంలోని శ్రామిక భవనంలో గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎక్కడ ఉచిత ఇసుక అందటలేదన్నారు. ట్రాక్టర్ రూ.7వేల నుంచి 8 వేలతో కొనుగోలు చేయాల్సి వస్తుందన్నారు. సొంతనాకి ఎవరైనా ఉచితంగా ఇసుక ట్రాక్టర్‌తో తోలుకోవచ్చని ప్రభుత్వం ప్రకటించినా మాఫియా దాడులు యథేచ్ఛగా సాగుతున్నాయన్నారు. ప్రభుత్వం తీరు ప్రకటనలకే పరిమితం కానీ అమల్లో మాత్రం మాఫియా చేతుల్లోనే అనధికారికంగా ఉంచినట్టుగా ఉందన్నారు. చిత్తశుద్ధితో ఉచిత ఇసుక విధాన్నాన్ని అమలు చేయాలని నరసింహారావు కోరారు. మున్నేరు వాగుల్లో ఇసుక తవ్వకాలకు స్థానికులకు అవకాశం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుబ్బారెడ్డి, సూర శ్రీను, జానీ, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు న్యాయం చేయాలి

వరద బాధితులకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని సీపీఎం కార్పొరేటర్ బోయి సత్యబాబు అన్నారు.కొత్తపేట పోలీస్‌స్టేషన్ ఎదురుగా శ్రామిక భవనంలో గురువారం జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ వరదతో సర్వస్వం కోల్పోయిన బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమయిందన్నారు. పరిహారం కొంతమంది చనిపోయిన వారిపేరున, చిన్న పిల్లల పేరున వారి ఖాతాల్లో జమచేసి బాధితులను ఇబ్బందులు పెడుతున్నారు. కొన్ని చోట్ల గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న వారిని ఫస్ట్ ఫ్లోర్‌లో ఉన్నట్టు చూపించి రూ. 10 వేలు వేసి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. పశ్చిమంలో సీపీఎం సర్వేలో 8 డివిజన్‌లో 40శాతం బాధితులకు నష్ట పరిహారం అందలేదన్నారు. శుక్రవారం ముఖ్యమంత్రికి సామూహిక వినతిపత్రాలు అందించే కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గాదె ఆదిలక్ష్మి, సీపీఎం నాయకులు కె.సూరిబాబు పాల్గొన్నారు. పాయలు అందేవిధంగా కూటమి ప్రభుత్వం వచ్చిన 100 రోజుల్లోనే చర్యలు తీసుకోవటం ముదావహం అన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	131,140,151
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 540

నేటితో ముగియనున్న దరఖాస్తు గడువు

గుడ్లవల్లేరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీ, డీఎస్సీ అభ్యర్థులు ఉచిత శిక్షణకు ఆంధ్రప్రదేశ్‌ఎస్‌సి, ఎస్‌టి డిఎస్‌సి అభ్యర్థులు ఉచిత శిక్షణ పొందుటకు ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ వారి ఉత్తర్వులు మేరకు జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో దరకాస్తు చేసుకొనేందుకు శుక్రవారమే ఆఖరుతేదీ. దరకాస్తు చేసుకొన్న అభ్యర్థులకు 6 స్టెప్స్ లో వెరిఫికేషన్ నిర్వహించి, ఈ నెల 27 వతేదీ నిర్వహించనున్న స్క్రీనిగ్ పరీక్షల్లో మెరిట్ అభ్యర్థులకు డిఎస్‌సి పరీక్షలకు ఉచిత సిక్షణకు ఎంపిక చేయనున్నారు.



ర్యాలీలో పాల్గొన్న గుడివాడ రోటరీ క్లబ్ సభ్యులు

అవగాహన ర్యాలీ

గుడివాడ రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా గుడివాడ మండలం సిద్ధాంతం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు పోలియో నివారణ నినాదాలతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. గుడివాడ రోటరీక్లబ్ అధ్యక్షుడు రాజశేఖర్ మాట్లాడుతూ దేశంలో పోలియో నిర్మూలనకు రూ.35 వేల కోట్లు ఖర్చు చేశారన్నారు. ఎటువంటి అనుమానాలు ఉన్నా పిల్లలు పోలియో చెకప్ చేసుకోవాలన్నారు. పిల్లలు ఆరోగ్య విషయాల్లో తగు జాగ్రత్తలు తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో రెడ్డియ్య చౌదరి, రావి శ్రీహర్ష, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న బి.నాగమణి

నివేదనశాల నిర్మాణానికి విరాళం

గుడివాడ, అక్టోబర్24(ఆంధ్రజ్యోతి) : మెయిన్‌రోడ్డులోని విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారి నివేదనశాల నిర్మాణానికి పట్టణానికి చెందిన ఎం.వెంకటేశ్వరరావు, సరోజిని దంపతులు కుమార్తె బి.నాగమణి గురువారం రూ.లక్ష విరాళం అందజేశారు.



మాట్లాడుతున్న జంగం మోహనరావు

యుఎన్‌ఓ డే

గుడ్లవల్లేరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు ఆధ్వర్యంలో గురువారం యూఎన్‌ఏ డే నిర్వహించారు. శ్రీ సాయి విద్యానికేతన్ విద్యార్థులకు ప్రపంచ శాంతి సామరస్యంపై అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షకార్యదర్శులు శశికళ, పెరుమాళ్లు, కోశాధికారి నవాబు తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి టీడీపీ సభ్యత్వ నమోదు

పెదపారుపూడి, అక్టోబరు 24, (ఆంధ్రజ్యోతి) : సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈ నెల 26వ తేదీ నుంచి మండలంలోని వెంట్రప్రగడ టీడీపీ కార్యాలయంలో ప్రారంభిస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి (చంటి), ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు తెలిపారు. సభ్యత్వం తీసుకున్న వ్యక్తికి రూ.ఐదులక్షల బీమా వరిస్తుందన్నారు.

కళాశాలకు వెళ్లాలంటే కష్టమే..

- సర్వీసులు రద్దు కావటంతోవిద్యార్థుల అవస్థలు
- చినముత్తేవికి బస్సులు పునరుద్ధరించండి

కూచిపూడి, అక్టోబరు 24, (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం నుంచి చినముత్తేవి మీదుగా మొవ్వ వెళ్లే బస్సులను ఆర్టీసీ అధికారులు పూర్తిగా రద్దు చేశారు. దాంతో పలు గ్రామాల ప్రజలు, విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏడాది క్రితం చినముత్తేవి ఐనంపూడి డ్రైన్‌పై నిర్మించిన వంతెన శిథిలం కావటంతో రాకపోకల కోసం తాత్కాలికంగా బెయిలీ బ్రిడ్జి ఇనుప వంతెన నిర్మించారు. వంతెనపై పెద్ద వాహనాలు వెళ్లేందుకు వీలు లేకుండా అధికారులు వంతెనకు ఇరువైపులా ఇనుప గడ్డర్లు ఏర్పాటు చేశారు. బస్సులు వెళ్లేందుకు వీలు లేకపోవటంతో ఆర్టీసీ సర్వీసులను రద్దు చేసింది. దీంతో మొవ్వలో ఇంటర్‌తోపాటు డిగ్రీ, పీజీ కళాశాలలు ఉండటం వల్ల ఈ ప్రాంత ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో స్పీడ్ బ్రేకర్లు లేకపోవటం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



బెయిలీ బ్రిడ్జికి ఇరువైపులా ఏర్పాటు చేసిన ఇనుప గడ్డర్లు

చినముత్తేవి వరకు పునరుద్ధరించండి



ఇనుప గడ్డర్ల వల్ల బస్సులు వెళ్లేందుకు వీలు లేకపోవటంతో కనీసం చినముత్తేవి వరకు బస్సులను పునరుద్ధరించాలని గ్రామసర్పంచ్ కొమ్ము సౌధామణి కోరారు. మచిలీపట్నం నుంచి నడిచే సర్వీసుల వల్ల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సర్వీసులు పునరుద్ధరించాలి.

- సౌధామణి, సర్పంచ్

333 సర్వీసులను కొనసాగించాలి



మచిలీపట్నం నుంచి నిమ్మకూరు వరకు నడుస్తున్న 333 సర్వీసులను చినముత్తేవి వరకు కొనసాగించాలి. సర్వీసులు పూర్తి రద్దు కావటం వల్ల ఆటోల్లో ప్రయాణించాల్సి వస్తుంది. ప్రయాణ చార్జీలు అధికంగా వసూలు చేస్తున్నారు. విద్యార్థులు, వ్యాపారస్థులు ఇబ్బందులు పడుతున్నారు.

- మహేష్ చంద్ర, గ్రామస్థులు

భారీ వాహనాలు రానివ్వం

నందివాడ, అక్టోబరు 24 (ఆంధ్ర జ్యోతి) : రహదారులు అధ్వానంగా ఉన్నాయి. మా రోడ్డుకు భారీ వాహనాలు (చేపల మేతల లారీలు) రానివ్వం.. గండేపూడి - పొనుకు మాడు గ్రామస్థులు గురువారం గొంగళ్లమూడి అడ్డ రోడ్డు వద్ద నిరసన తెలిపారు. బడాని శ్రీనివాసరావు మాట్లాడుతూ గొంగళ్లమూడి నుంచి గండేపూడి పొనుకుమాడు వెళ్లే ఆర్ అండ్ బీ రోడ్డు పూర్తిగా గోతులమ యంగా మారిందన్నారు. బడి పిల్లలు కూడా సైకిల్ తొక్కుతూ గోతుల్లో పడపోవటం వల్ల బడికి కూడా మానివేశారన్నారు. మంచినీటి వ్యాన్‌లు కూడా గ్రామాల్లో రాక నానా అవస్థలు పడుతున్నామన్నారు. అసలే అ.ద్వానంగా రోడ్డు ఉంటే చేపల చెరువుల యజమానులు మాత్రం చేపల మేతల లారీలు 30 టన్నుల నుంచి 40 టన్నుల వరకు లారీల ద్వారా



నిరసన తెలుపుతున్న స్థానికులు

దిగుమతులు చేసుకుంటున్నారన్నారు. కనీసం చేపల చెరువుల యజమానులు కూడా ఈ గోతులను పూడ్చటం లేదన్నారు. పల్లె పండుగలో మహిళలు ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు వెుంర పెట్టుకున్నావున్నారు. ఎటువంటి స్పందన లేకపోవటంతో మా పిల్లలు భవిష్యత్ కోసం రోడ్డు ఎక్కవలసిన పరిస్థితి ఏర్పడిందని గ్రామస్థులు అంటున్నారు. శివాజీ మాట్లాడుతూ తమిరిశ నుంచి నందివాడ వెళ్లాలంటే రోడ్డు చాలా భయంకరంగా ఉందన్నారు.

యూటీఎఫ్ కార్యవర్గం

గుడివాడ రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ మండల యూటీఎఫ్ 2024-25 కార్యవర్గం గురువారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఎన్నికల అధికారిగా ఎ.వి.వరలక్ష్మి, పరిశీలకుడిగా ఎల్.నరేంద్ర ఆధ్వ ర్యంలో ఎన్నికలు జరిగాయి. అంబే ద్కర్ భవన్‌లో జరిగిన కార్యక్రమం లో మండల అధ్యక్షుడిగా ఎస్.ఎం.కె.ఎం.బా యాజీ, ప్రధాన కార్యదర్శి గా డి.రాజశేఖర్, గౌరవ అధ్యక్షుడిగా వై.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా పి. ఎస్.ఎస్. కపర్తి, కోశాధికారిగా జయ రాజు, ఆడిట్ కమిటీ సభ్యులుగా బి.రామకృష్ణ, కార్యవర్గసభ్యులుగా ఎస్.లత, ఎం.కోటేశ్వరరావు, ఎం.సుభానీ,



బాయాజీ, డి.రాజశేఖర్

డి.దురా ్గరావు, బి.నాగబాబు, కె.ఈ.ఎస్.ఎన్.మూర్తి, జి.రాములు ఎన్నికయ్యారు. కార్యదర్శి వర్గంగా కె.రాఘవేంద్రరావు, జె.భగవద్గీత, బి.జ్యోతి లక్ష్మి, డి.రమేష్‌బాబు, జి.రాంగోపాల్, జిల్లా కౌన్సిలర్లుగా ఎ.వి.ఎస్.కామాక్షి కుమారి, వై.నాగరాజు, కె.దుర్గారావు ఎన్నికయ్యారు.

సభ్యత్వ నమోదు విజయవంతం చేయండి

- ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పామర్రు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : తెలుగుతదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గ్రామ, మండల పట్టణ స్థాయి నాయకులు బాధ్యతయుతంగా నిర్వహించాలని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. నియోజకవర్గంలో ఈనెల 26నుంచి ప్రారంభం కానున్న ఈ కార్య క్రమాన్ని విజయవంతం చేయా లన్నారు. టీడీపీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్త సభ్యత్వాలతోపాటు రెన్యువల్స్ చేయాలన్నారు. కార్యకర్తల కోసం సంక్షేమ నిధిని టీడీపీ ఏర్పాటు చేసిందన్నారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు కుదరవల్లి



మాట్లాడుతున్న వర్ల కుమార్‌రాజా

ప్రవీణ్ చంద్ర, తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి వల్లూరిపల్లి గణేష్, వీరంకి వెంకటేశ్వరరావు, దాలిపర్తి ప్రసాద్, పానుగంటి సందీప్, బేతనబోట్ల సుబ్బారావు, తెలుగు యవత అధ్యక్షుడు కేదరాశిపల్లి శ్రీను, చాట్ల రమేష్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం

- కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాజ్జీ

గుడివాడ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త నిబద్ధతతో పని చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జి మార్నిడీ బాబ్జీ పిలుపునిచ్చారు. వడ్డాది చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో గురువారం జిల్లా అధ్యక్షుడు గొల్లు కృష్ణ అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ కార్యకర్తల సమావేశానికి బాజ్జీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కూటమి మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి వడ్డాది



మాట్లాడుతున్న బాజ్జీ

రాజేష్ మాట్లాడుతూ ప్రాంతీయ పార్టీలు అయిన టీడీపీ, జనసేన, వైసీపీల వల్ల ప్రజలకు ఎటువంటి మేలు జరగదన్నారు. సమావేశంలో మొవ్వ మోహనరావు, వి.సుబ్రహ్మణ్యం, బాణవత్ నాయక్, కోక ఫణిభూషణ్, వడ్డాది శివకృష్ణ, సదర్ల నాగేంద్ర, దగాని నిశ్చల, కె.సత్యవతి పాల్గొన్నారు.



లేఅవుట్‌ను పరిశీలిస్తున్న జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ వెంకట్రావు

త్వరగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి

గృహనిర్మాణ శాఖ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ వెంకట్రావు

గుడివాడ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం చేపట్టిన "మన ఇల్లు-మన గౌరవం" కార్యక్రమంలో భాగంగా ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని గృహనిర్మాణ శాఖ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.వెంకట్రావు అన్నారు. మల్లాయిపాలెం శివారు గృహనిర్మాణ లేవుట్‌ను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడుతూ ఇళ్లను 31మార్చి 2025లోపు పూర్తి చేస్తే వారికి రావలసిన ప్రతి బిల్లు త్వరితగతిన వారి బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏసీ గుమ్మడి రత్నశ్రీ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రామోజీనాయక్ పాల్గొన్నారు.



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

పారిశుధ్య మెరుగుదలకు చర్యలు

గుడివాడ, అక్టోబర్24(ఆంధ్రజ్యోతి) : పట్టణంలో పారిశుధ్య మెరుగుదలకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమీషనర్ బి.శ్రీనివాసరావు అన్నారు. గురువారం పట్టణంలోని 22,31,32,33,34 వార్డుల్లో అసిస్టెంట్ కమీషనర్ పి.శ్రీనివాసరావుతో కలిసి పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని అనివార్య కారణాలతో ఇంటింటి చెత్త సేకరణలో జాప్యం చోటుచేసుకుందన్నారు. పారిశుధ్య మెరుగుదలకు చర్యలు చేపట్టామన్నారు. సిబ్బంది విధులు నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆలయంలో హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

రూ. 4.81లక్షల ఆదాయం

మంటాడ(పమిడిముక్కల), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మంటాడలో అలివేలుమంగా పద్మావతి సమేత వైకుంఠ వేంకటేశ్వరస్వామి, శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానం హుండీలద్వారా రూ. 4,81,137 ఆదాయం వచ్చింది. ఆలయాల్లో ఉన్న 9 హుండీలను దేవదాయ శాఖ గన్నవరం తనిఖీ అధికారి అనురాధ సమక్షంలో గురువారం తెరచి లెక్కించారు. భక్తులు 87రోజులకు సమర్పించిన కానులకుగాను ఈమొత్తం ఆదాయం వచ్చినట్టు ఆలయ కార్యనిర్వహణ అధికారి ఆర్.మాధవీలత తెలిపారు. ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎ.రామమోహనరావు, సేవాసమితి సభ్యులు, ఆలయ సిబ్బంది హుండీల లెక్కింపులో పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు ఆదర్శనీయం

- జిల్లా లయన్స్ గవర్నర్ శేషగిరి

తోట్లవల్లూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆపన్నులకు లయన్స్ క్లబ్ అందజేస్తున్న సేవలు ఆదర్శనీయమని క్లబ్ గవర్నర్ గడ్డెశేషగిరి అన్నారు. యాకమూరు సుధీర్ టింబర్ మీటింగ్ హాల్‌లో గురువారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో వరదభాదిత కుటుంబాలకు పలువస్తులతో కూడిన కిట్లను అందించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన శేషగిరి మాట్లాడుతూ, మండలంలో నష్టపోయిన వరదభాదితులకు సహాయం అందించేందుకు ఎల్‌సీఎఫ్ గ్రాంట్ పేరుతో వస్తుల కిట్‌లను అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నెరెళ్ల తేజ,మాజీ జిల్లా గవర్నర్ పి.సుభాష్, నూకల వెంకటసాంబశివరావు, ప్రసాద్, రీజనల్ చైర్‌పర్సన్ బండి జ్యోతి పాల్గొన్నారు.



మార్జిన్‌లో వాహనాలను తొలగిస్తున్న ట్రాఫిక్ ఎస్.ఐ ప్రసాదరావు

మార్జిన్‌లోని వాహనాల తొలగింపు

గుడివాడ, అక్టోబర్24(ఆంధ్రజ్యోతి) : రహధారి మార్జిన్‌లలో నిలుపుదల చేస్తున్న లారీలను తొలగించామని, రహదారుల మార్జిన్‌లో వాహనాలను నిలుపుదల చేస్తు చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్.ఐ ప్రసాదరావు హెచ్చరించారు. జిల్లా ఎస్.పి ఆర్.గంగాధరరావు ఆదేశాల మేరకు గుడివాడ-గుడ్లవల్లేరు వెళ్ళు ప్రధాన రహదారిలో ఆపి ఉన్న లారీలను గురువారం ఆటోనగర్ లారీ స్టాండ్‌కు తరలించామన్నారు. మరమ్మత్తుల్లో ఉన్న మూడు లారీలను క్రేన్ సహాయంతో వేరే ప్రదేశానికి తరలించామని ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	131, 140, 151
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్ల ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.540

రీ సర్వే సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

మోపిదేవి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నిర్వహించిన రీ సర్వే ద్వారా తలెత్తిన భూ సంబంధిత సమస్యల పరిష్కారానికే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ విజయలక్ష్మి తెలిపారు. గురువారం మండలంలోని మెరకనపల్లిలో గ్రామసభ నిర్వహించారు. సమావేశంలో భాగంగా భూముల హక్కుల మార్పులు, అడంగల్‌లో రైతుల పేర్ల మార్పులకు సంబంధించి రైతుల నుంచి వచ్చిన అర్జీలను మండల సర్వేయర్ రామకృష్ణ స్వీకరించారు. సర్పంచ్ యర్రంశెట్టి ధన రాజ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఆర్ఐ ఎం.శ్రీనివాసరావు, వీఆర్వో వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం

యువనేత మండలి వెంకట్రామ్

మోపిదేవి/ చల్లపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఓటు వజ్రాయుధమని, కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల ప్రక్రియలో భాగంగా డిగ్రీ పూర్తయిన యువతీ, యువకులంతా ఓటరుగా నమోదు కావాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్ విజ్ఞప్తి చేశారు. గురువారం కూటమి ఆధ్వర్యంలో మోపిదేవిలో ఎమ్మెల్సీ ఓటరు నమోదు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి శ్రేణులంతా ఆయా గ్రామాల్లో 2021 సంవత్సరానికి డిగ్రీ పూర్తైన యువ కులందరి చేత ఓటు హక్కు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఎంపీపీ రావి దుర్గావాణి ఓటు హక్కు నమోదు చేసుకునేందుకు దర ఖాస్తులను వెంకట్రామ్‌కు అందజేశారు. మండల టీడీపీ అధ్యక్షులు నడకుదుటి జనార్ధనరావు, పార్టీ సీనియర్ నాయకులు రావి నాగేశ్వరరావు, వైస్ ఎం పీపీ కడవకొల్లు సీతారామాంజనేయులు, ఎమ్మెల్సీ ఓటరు నమోదు నియోజకవర్గ పరిశీలకులు రావి రత్నగిరి, కోనేరు చంద్రమౌళి, బీజేపీ మండల అధ్య క్షులు సనకా ప్రశాంత్, మండల పరిషత్ కో- ఆప్షన్ సభ్యులు చందన రంగారావు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులకు భూమిపూజ

పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా వెంకటాపురం గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో చేపట్టను న్న సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులకు మండలి వెంకట్రామ్ భూమి పూజ, శంకుస్థాపన చేశారు. ఎంపీపీ రావి దుర్గావాణి, సర్పంచ్ తుమ్మా సోముల మ్మ, వైస్ ఎంపీపీ కడవకొల్లు సీతారామాంజనేయు లు, పార్టీ నాయకులు నడకుదుటి జనార్ధనరావు, రావి నాగేశ్వరరావు, గొర్రెపాటి నాగేశ్వరరావు, పంచా యతీ సెక్రటరీ సుధాకర్ ఉన్నారు.



ఓటరు నమోదుకు వెంకట్రామ్‌కు దరఖాస్తు అందిస్తున్న ఎంపీపీ రావి దుర్గావాణి

ఎమ్మెల్సీ ఓటు నమోదు కేంద్రానికి విశేష స్పందన

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు కేంద్రానికి మూడవ రోజు సైతం విశేష స్పందన లభించినట్లు తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు మోర్ల శివ తెలిపారు. స్థానిక ఏటీఎం సెంటరులో ఏర్పాటు చేసిన ఓటు నమోదు కేంద్రంలో పట్టభద్రులు ఓట్లను నమోదు చేస్తున్నారు. ఇప్పటివరకూ 700 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఎంపీటీసీ పైడిపాముల స్వప్న, షేక్ నబీఘోరి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ తోట కనకదుర్గ, నేతలు మోర్ల ప్రసాద్, వాసిరెడ్డి రాకేష్, బావిశెట్టి కనకదుర్గ, లుక్కా శేషు, మేడికొండ రవిబాబు, పఠాన్ జిలాని తదితరులు పాల్గొన్నారు.



చల్లపల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న టీడీపీ నేతలు

40 మద్యం సీసాలు స్వాధీనం



నాగాయలంక, అక్టోబరు 24 (ఆంధ్ర జ్యోతి): సొర్లగొంది గ్రామానికి చెందిన కొప్పనాతి సురేష్ అక్రమంగా మద్యం విక్రయించేందుకు గురువారం నాగాయలంక నుంచి మద్యం సీసాలను తీసుకుని బైక్‌పై వెళ్తుండగా, రేమాలవారిపాలెం వంతెన సెంటర్లో పోలీసుల తనిఖీల్లో గుర్తించి అతని వద్ద నుంచి 24 క్వార్టర్ మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.రాజేష్ తెలిపారు.

చిన్నాపురంలో అభివృద్ధి పనులు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 24 (ఆంధ్ర జ్యోతి): బందరు మండలం చిన్నాపురంలో వేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. గురువారం మంచినీటి చెరువు దగ్గర నుంచి 3వ నెంబరు పంట కాల్వ వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సర్పంచ్ గోపాలరావు ప్రారంభించారు. కూటమి ప్రభుత్వంలో పనులు ప్రారంభం పట్ల గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

దాళ్వా సాగుకు నీరందించాలి: రైతు సంఘం



బంటుమిల్లి డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నేతలు

బంటుమిల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బంటుమిల్లి ప్రధాన కాల్వ పరిధిలో దాళ్వా సాగుకు నీరు అందించాలని, గతంలో ప్రకటించిన రైతులకు నష్టపరిహారం, అన్నదాత సుఖీభవ పథకాన్ని వెంటనే మంజూరు చేయాలని కోరుతూ బంటుమిల్లి రైతు సంఘం నాయకులు స్థానిక డిప్యూటీ తహసీల్దార్ పూర్ణచంద్రరావుకు గురువారం వినతిపత్రం ఇచ్చారు. గౌరిశెట్టి నాగేశ్వరరావు, అజయ్‌ఘోష్, విశ్వనాథం, నాగేంద్రరావు, నాగేశ్వరరావు, లవయ్య, శివశ్రీని వారావు, నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కేయూలో నాక్ బృందం తనిఖీలు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 24 (ఆంధ్ర జ్యోతి): కృష్ణా విశ్వవిద్యాలయంలో రెండో రోజు నాక్ బృందం రెండు బృందాలుగా విడిపోయి వివిధ విభాగాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆర్. శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ శోభన్ బాబు, డీన్‌లు బసవేశ్వరరావు, సుందరకృష్ణ, ఇంగ్లీషు విభాగం హెడ్ ఉష తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న నాక్‌బృందం

72 మందికి వైద్యపరీక్షలు

అవనిగడ్డ రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పులిగడ్డలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో డాక్టర్ రియాజ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. 72 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, పల్లెపాలెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌పీ పుష్ప, ఏఎన్ఎం కె.సుగుణ, ఆశా వర్కర్లు జి.నిర్మలకుమారి, జె.భ్రమరాంబ, సుబ్బయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు దేశభక్తి కలిగి ఉండాలి

బంటుమిల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఐకమత్యం, సోదరభావంతో, దేశభక్తి కలిగి ఉండాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఐక్యరాజ్య సమితి దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమం జరిగింది. యూనియన్ బ్యాంకు సౌజన్యంతో బ్యాం కింగ్ రంగానికి సంబంధించిన పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.జగన్మోహరావు, వైస్ ప్రిన్సిపాల్ జయరాజ్, డాక్టర్ జీడీ ఆనం దకుమార్, కోఆర్డినేటర్ హిమాలినీ దేవి, డాక్టర్ సత్యరాజేష్, సుజాత, జ్యోత్స్న, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా మందులు విక్రయిస్తున్న ఆర్ఎంపీకి రెండేళ్ల జైలు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 24 (ఆంధ్ర జ్యోతి): లైసెన్స్ లేకుండా మందులు నిల్వ ఉంచి అమ్ముతున్న కోడూరుకు చెందిన ఆర్ఎంపీ అద్దంకి మురళీకృష్ణకు రెండేళ్ల జైలు, రూ. 50వేల జరిమానా విధిస్తూ మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి చిన్నంశెట్టి రాజు తీర్పు ఇచ్చారు. గురువారం ఈ కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిన్నారావు వాదనలు వినిపించారు. కోవిడ్ సమయంలో అప్పటి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జి. విజయభాస్కర్ ఆర్ఎంపీ మురళీకృష్ణపై కేసు నమోదు చేశారు. ఈ కేసు వాదోపవాదాల తరువాత గురువారం తుది తీర్పు ఇచ్చారు.

నవంబరు 16,17 తేదీల్లో ఈషా గ్రామోత్సవం

ఆటోనగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ ప్రభుత్వ కళాశాల మైదానంలో నవంబరు 16,17 తేదీల్లో 16వ ఈషా గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు ఈషా వలంటీర్, ప్రోగ్రామ్ కో- ఆర్డినేటర్ గన్నె శివలక్ష్మి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. యువతరం ఆరోగ్యమైన జీవనశైలి వైపు మళ్లేందుకు ఈ గ్రామోత్సవం ఒక వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. పురుషులకు వాలీబాల్, మహిళలకు త్రోబాల్ పోటీలు నిర్వహిస్తున్నామని, విజేతలకు నగదు బహుమతులు, ట్రోఫీలు, ప్రశంసా పత్రాలు అందజేస్తామని వెల్లడించారు. పోటీలో పాల్గొన్న జట్లకు ప్రోత్సాహక బహుమతులు ఉంటాయన్నారు. రిజిస్ట్రేషన్‌కు 8300030999ను సంప్రదించాలని కోరారు.

మద్యం షాపు ఏర్పాటుకు అనుమతి వద్దు



డిప్యూటీ తహసీల్దార్ కనకదుర్గకు వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

ఘంటసాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఘంటసాల సత్రం సెంటర్ నుంచి మల్లంపల్లి గ్రామానికి వెళ్లే రహదారిలో నూతన మద్యం షాపు ఏర్పాటు చేసుకు నేందుకు సన్నాహాలు చేస్తున్నారని ఆ ప్రాంతంలో మద్యం షాపు ఏర్పాటును నిలుపుదల చేయాలని పరిసర ప్రాంత మహిళలు గురువారం డిప్యూటీ తహసీల్దార్ బి.కనక దుర్గకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆప్రాంత వాసులు మాట్లాడు తూ మద్యం షాపు నివాస ప్రాంతాలకు దూరంగా ఏర్పాటు చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

వరద బాధితులకు నష్టపరిహారం అందించాలి

నాగాయలంక, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వరదలకు నాగాయ లంక చిన్న కరకట్ట కింద దెబ్బతిన్న ఆవాస గృహాల్లో 11 మంది బాధితు లకు ఇప్పటి వరకు ప్రభుత్వ నష్టపరిహారం అందలే దని మండల వైసీపీ నేత మద్ది చిన్నారి గురువారం బాధితులతో కలసి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎం.హరనాథ బాబుకు వినతిపత్రం అందజేశారు.

వ్యవసాయ క్షేత్రం సందర్శించిన విద్యార్థులు

అవనిగడ్డ రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం అశ్వారావుపాలెంలోని వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి వ్యవసాయంలో రైతులు అవలంబిస్తున్న విధానాలను అడిగి తెలుసుకున్నారు. జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు కె.కృష్ణవేణి 8వ తరగతి విద్యార్థులను క్షేత్ర సందర్శన నిమిత్తం పొలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామోపాధ్యాయులు ఏ.భాను ప్రకాష్, ఉపాధ్యాయులు ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

నాగుల చవితి వేడుకలపై సమీక్ష నేడు

మోపిదేవి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో నవంబరు 5వ తేదీన జరిగే నాగుల చవితి పర్వదినం ఏర్పాట్లపై వివిధ శాఖల ఉద్యోగులతో సమీక్షా సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. దేవస్థానం ప్రాంగణంలో మధ్యాహ్నం 2 గంటలకు జరిగే సమీక్షా సమావేశానికి ఆయా శాఖల ఉద్యోగులు హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు.

ఆర్యవైశ్య సంఘం నేత తాండవకృష్ణ కన్నుమూత

చల్లపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండల ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు, కృష్ణాజిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు వరదా తాండవకృష్ణ(70) గురువారం కన్నుమూశారు. గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గురువారం మధ్యాహ్నం విజయవాడలోని కుమారుని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తాండవకృష్ణ మృతిపట్ల ఆర్యవైశ్యసంఘ నేతలు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆయన మృతికి సంతాపం తెలియజేశారు.

చీరలు, బిందెల ఆదాయం రూ.40 వేలు

అవనిగడ్డ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : లంకమ్మ అమ్మవారికి సమర్పించిన బిందెలు, చీరలు వేలం నిర్వహించగా, రూ.40 వేలు ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు తెలిపారు. చీరల వేలం పాటకు రూ.30, 425లు లభించగా, ఘటం బిందెలకు రూ.7850లు, ధాన్యం అమ్మగా మిగిలిన మొత్తం లభించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది ఏడుకొండలు, సామ్రాజ్యం, వి.కృష్ణమూర్తి, కూనపరెడ్డి పరశురామ్ పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



నాగాయలంక, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు, ఏపీఎస్ఆర్టీసీ మాజీ చైర్మన్ వర్ల రామయ్యను గురువారం నాగాయలంక మండల తెలుగు యువత నేత మేడికొండ విజయ్ విజయవాడలోని ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. దశాబ్ద కాలంగా టీడీపీలో పని చేస్తూ పార్టీలో యువతను చేర్పిస్తున్నట్లు రామయ్యకు విజయ్ తెలిపారు.

రేపటి నుంచి టీడీపీ సభ్యత్వ నమోదు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈనెల 26వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని, ఈ కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు, కార్య కర్తలు విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడారు. రూ. 100తో తీసుకునే సభ్యత్వానికి రూ. 5 లక్షల ప్రమాద బీమా కల్పించారన్నారు.

సైబర్ క్రైమ్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

ఘంటసాల, అక్టోబరు 24 (ఆంధ్ర జ్యోతి) : పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా స్థానిక వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు గురువారం సైబర్ క్రైమ్ నేరాలపై అవగాహన కల్పించారు. ఘంటసాల ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ లోన్ యాప్‌లను నమ్మి మోసపోవద్దని తెలిపారు. ఆన్‌లైన్ మోసాల పట్ల విద్యార్థులు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. అమెజాన్, ఇతర సంస్థల నుంచి భారీ గిఫ్ట్ ఆఫర్స్ వచ్చాయి నగదు జమ చేయాలని చెబితే వాటిని నమ్మవద్దని హితవు పలికారు.